సూర్య ఆదివారం
www.suryaa.com
9.2.2025



# అమర ప్రేమికులు
# లైలా మజ్ను



## ఛైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**ఎన్‌ఆర్ నారాయణ మూర్తి, ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ లాంటి ప్రముఖులు దేశ ఆర్థిక వృద్ధికి ఎక్కువ గంటలు పనిచేయాలని సూచించిన నేపథ్యంలో..వర్క్-లైఫ్ బ్యాలెన్సింగ్పై విస్తృత చర్చ జరుగుతోంది. ఆర్థిక సర్వేలోనూ పనిగంటల అంశం ప్రస్తావనకు వచ్చింది. వారానికి 60 గంటలకు మించి పని చేయడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. వివిధ అధ్యయనాల నివేదికలను ఇందులో ప్రముఖంగా ప్రస్తావించింది. మీరుమంటారు**

= అంపిలి విజయకుమార్, విశాఖపట్నం

మీరన్నది నిజమే విజయ్ కుమార్ గారూ...

ఆర్థిక సర్వే 2024-25 ప్రకారం.. "ఆఫీసుల్లో ఎక్కువ సేపు గడపడం మంచిది కాదు. రోజుకు 12, అంతకంటే ఎక్కువ సేపు పనిచేసే వ్యక్తులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. వారానికి ఎక్కువ గంటలు పని చేయడం ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ పని గంటలతో ఉత్పాదకత పెరిగినా.. వారానికి 55-50 గంటల మధ్య పని చేయడం ఆరోగ్యాన్ని దెబ్బ తీయడమేనని డబ్ల్యూహెచ్వో-ఐఎల్వో నివేదిక స్పష్టం చేసింది" అని ఆర్థిక సర్వే వెల్లడించింది. అలాగే.. సుదీర్ఘంగా ఒకే దగ్గర ఎక్కువ గంటలు పని చేయడం మానసిక ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుందని సపెయిన్ లాబ్స్ సెంటర్ ఫర్ హ్యుమన్ బ్రెయిన్ అండ్ మైండ్ స్టడీ రిపోర్ట్ను ఎకనామిక్ సర్వే హైలైట్ చేసింది.

పని గంటలపై పరిమితులు విధించడం ఆర్థిక వృద్ధికి అవాంతరాన్ని కలిగించొచ్చని సర్వే అభిప్రాయపడింది. అలాగే కార్మికుల సంపాదన సామర్థ్యాన్ని దెబ్బ తీసే అవకాశం లేకపోలేదని తెలిపింది. సౌకర్యకర పని గంటల విధానం భారతదేశాన్ని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంచుతుంది.. ఈ చర్యలతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి తోడ్పడుతుంది అని ఆర్థిక సర్వే సూచించింది.

బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. అనంతరం 2024-25 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్సభలో ప్రవేశపెట్టారు. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఆర్థిక సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్మెంట్లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది.

**2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ..ఈసారి బడ్జెట్లో ఎవరిపై వరాల జల్లు కురిపించనున్నారనే విషయంపై అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పన్నులు కట్టేవాళ్లకు బడ్జెట్లో ఎలాంటి ఉపశమనం ఉంటుందనేది కాసేపట్లో తేలిపోనుంది. మధ్య తరగతికి ఎటువంటి లబ్ధి ఉంటుందనేది కూడా తేలనుంది. తెలంగాణ పరిస్థితి ఏమిటి సార్..**

ఆర్థ వియలక్ష్మి , హైదరాబాద్

అవును విజయగారూ.... మీరన్నట్టు బడ్జెట్కు ముందు రోజు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆర్థిక సర్వేను ప్రకటించింది. ఆ సర్వేలో పన్నుల వసూళ్లలో తెలంగాణ టాప్లో ఉంది. ఈ విషయాన్ని పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో వెల్లడించారు. 15 పెద్ద రాష్ట్రాలతో పోల్చితే 88 శాతం సొంత పన్నుల రాబడుల్లో తెలంగాణ టాప్లో నిలిచినట్లు వెల్లడించారు.

గతేడాది సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (%మీవీఖు%) విధానాన్ని ఆర్థిక సర్వేలో ప్రత్యేకంగా ప్రశంసించారు. 100 శాతం గ్రామీణ త్రాగునీరు సరఫరా కలిగిన రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించిందని సర్వేలో పేర్కొంది. ప్రజలకు రక్షిత తాగునీరిచ్చేందుకు కేంద్రం జల్ జీవన్ మిషన్ను ప్రవేశపెట్టగా..100 శాతం అమలు చేస్తున్న 8 రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉందని చెప్పారు. ఇక ఐటీ సేవల్లోనూ తెలంగాణ సత్తా చాటిందన్నారు. ఐటీ సేవల్లో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ముందు వరసలో ఉన్నాయని సర్వేలో వెల్లడించారు. ఐటీతోపాటు హైదరాబాద్లో ఆర్థిక సేవలందించే ఫిన్టెక్లు రావటం కారణంగా ఆఫీసులు, నివాస స్థలాలకు గిరాకీ పెరిగిందని తెలిపారు.

డ్రోన్ల ద్వారా వ్యాక్సిన్లు, మందులను సరఫరా చేసేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక ప్రాజెక్టు అమలు చేస్తోందని చెప్పారు. 2021 సెప్టెంబరులో తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి సహకారంతో వికారాబాద్ జిల్లాలో అమలు చేస్తున్న ప్రాజెక్టు ఆసియాలోనే ప్రప్రథమమని ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. చైనా తర్వాత ఎక్కువ పరిమాణంలో సిమెంటును ఇండియా ఉత్పత్తి చేస్తుండగా.. 13 రాష్ట్రాల్లో 87 శాతం సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయన్నారు. వీటిలోల్లోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందు వరసలో ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో 86 శాతం భూములకు సాగు నీరందుతోందని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో వి-హబ్ దేశానికి రోల్ మోడల్గా నిలిచిందని ఆర్థిక సర్వేలో తెలిపారు.

## లెజెండ్

# ఆధునిక భారతదేశ గాంధీ 'ఆమ్టే'



దీపావళి పండగ నాడు మిఠాయిలు, టపాసులు కొనుక్కోమని తన తల్లి ఇచ్చిన నాణేలతో దుకాణానికి పరిగెడుతున్న బాలుడికి 'ఈ అంధుడికి ఒక్కపైసా ఇవ్వండి భగవాన్' అన్న అంధుని ఆర్తనాదాలు చెవిన పడ్డాయి. ఆ బాలుడు తన దగ్గరున్న పెద్దమొత్తంలో ఉన్న నాణేలన్నీ ఆ బిచ్చగాడి డబ్బాలో వేయగా, ఆ బిచ్చగాడు ' నాకు చూపులేదని నాడబ్బాలో దయచేసి రాళ్ళు వేయొద్దు బాబు ! ' అన్నాడు. ఇవి రాళ్ళు కాదు నిజంగా డబ్బులే , కావాలంటే చేతితో తడిమి చూసుకో అన్న ఆ బాలుడు మాటలు విని బిచ్చగాడు తడిమి చూసి అవి నాణేలు అని తెలియగానే తన కళ్ళవెంట ఆనందభాష్పాలు రాల్చాడు ! ఆ సంఘటన చూసి బాలుడు ఏడుపు ఆపుకోలేక ఇంటికి పరిగెత్తి 'ఇలాంటి వారికోసం పెద్ద అయిన తరువాత ఏదైనా చేయాలి ' అని ఆ పసి హృదయంలో ముద్రించుకున్నాడు. ఆయన ఎవరో కాదు ! ఆయనే బాబా ఆమ్టే ! ఇప్పటి తరానికి ఈయన తెలికపోవచ్చు ! కానీ తెలియపర్చాల్సిన బాధ్యత మన మీద ఉంది.

**కుష్టు వ్యాధిపై యుద్ధం:** బాబా ఆమ్టే అసలు పేరు మురళీధర్ దేవీదాస్ ఆమ్టే. ఆయన తల్లిదండ్రులు ముద్దుగా ' బాబా ' అని పిలిచేవారు. 26 డిసెంబర్ 1914లో మహారాష్ట్రలోని హింగన్ఘాట్లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబంలో జన్మించారు. ఆయన చిన్నప్పుడు చాలా విలాసవంతమైన జీవితంలో పెరిగారు. ఉన్నత కుటుంబంలో జన్మించి కూడా భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిచల్సిన అతని కృషి మరవలేనిది. బాహ్య ప్రపంచంలో ప్రజల బాధలను చూడకుండా ఉండటానికి ఏర్పాటు చేయబడిన భారీ అడ్డంకులకు వ్యతిరేకంగా అతను తిరుగుబాటు చేశారు.

కుష్టు వ్యాధిని ఒక వ్యాధిగా చికిత్స చేయడం చుట్టూ ఉండే అజ్ఞానాన్ని తొలగించడానికి అతను పోరాడారు. కుష్టు వ్యాధి అత్యంత అంటువ్యాధి అనే విస్తృతమైన భావనను తోసిపుచ్చే ప్రయత్నంలో అతను కుష్టురోగి నుండి బాసిల్లిని తనలోకి ఇంజెక్ట్ చేయడానికి కూడా అంగీకరించారు. కుష్టు వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల సంరక్షణ, చికిత్సకు ప్రాధాన్యత ఇచ్చి వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చారు. బాధితుల మధ్య నివసించారు. వారికి వైద్య సంరక్షణ లభించేలా చూసుకున్నారు. ఇది వారి వ్యాధి దుఃఖానికి ముగింపు పలికింది. చికిత్స పొంది కోలుకున్న రోగుల కోసం చిన్న తరహా హస్తకళల తయారీ, వృత్తి శిక్షణను ఏర్పాటు చేసి, వారు తయారు చేసిన వస్తువులను సేకరించి విక్రయించి వారికి ఆర్థిక స్వావలంబన కలిగించారు.
దీ

మహారాష్ట్రలో కుష్టు రోగులు, దివ్యాంగులు, నిరుపేద సాధారణ ప్రజల సంరక్షణ, పునరావాసం కోసం మూడు ఆశ్రమాలను స్థాపించారు. 1949 ఆగస్టు 15న తన భార్య సాధన ఆమ్టేతో కలిసి ఆనందవన్లో ఒక చెట్టు కింద కుష్టువ్యాధి ఆసుపత్రిని స్థాపించారు. ఇది కుష్టు, ఆర్థోపెడిక్ వైకల్యాలు, దృష్టి, వినికిడి లోపాలు ఉన్నవారు, ఆదిమ గిరిజన సభ్యులతో సహా వేలాది మంది వెనుకబడిన వ్యక్తులు తమను తాము పోషించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడింది. 1973లో గడ్చిరోలి జిల్లాలోని మాడియా గోండ్ గిరిజన ప్రజల కోసం ఆమ్టే లోక్ బిరాదరి ప్రకల్పు స్థాపించారు.

**ఆధునిక భారతదేశ గాంధీ :** బాబాఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మి పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తరువాత అతనితో పాటు కొద్ది రోజులు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపి గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా వంటపట్టించుకున్నారు. న్యాయశాస్త్రంలో శిక్షణ పొందిన ఆయన భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో వలస ప్రభుత్వం ఖైదు చేసిన భారత నాయకులకు డిఫెన్స్ న్యాయవాదిగా పనిచేసారు. ఆ సమయంలోనే గాంధీజీ బాబాఆమ్టేకు అభయసాధక్ అనే బిరుదు ఇచ్చారు. కుష్టురోగులకు భయపడక వారి సంక్షేమానికి ఇతను చేస్తున్న కృషి ఫలితమే ఆ బిరుదు. ఆ తరువాత బాబా ఆమ్టే సిద్ధాంతాలపై కూడా గాంధీజీ ప్రభావం చాలా పడింది. శేషజీవితం అణగారిన వర్గాల కొరకే గడపడమే కాకుండా, వస్త్రధారణలో ఖద్దరు బట్టలనే ధరించడం ఇత్యాది విషయాలలో ఆ ఇద్దరిలో సామ్యముంది. అంతేకాదు ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనం చేస్తూ జీవనం గడిపారు. స్వయంసమృద్ధి గ్రామాలు ఉండాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ అవినీతి, అసమర్థత, నాసిరకం, దూరదృష్టితో కూడిన ప్రణాళికను ఎదుర్కోవడానికి ఆమ్టే గాంధీ మార్గాన్ని అనుసరించారు. ఆయనను ఆధునిక భారతదేశ గాంధీ అని కూడా పిలుస్తారు.

జనక మోహన రావు దుంగ
8247045230

(మిగతా వచ్చేవారం)

# నవ కవిత్వం

## దాహార్తి!



రాజకుటీర సింహాసన కిరీటాల
వలయం ఈ ప్రపంచం,
ఈ విభజనల ప్రపంచమే మనిషికి
శత్రువు.
నిత్యం మూఢాచార మూలుగులతో,
సంపదల పెంపులతో వెంపర్లాడునీ
లోకం.
ఇచ్చోటనే శరీరాలు గాయపడ్డాయి,
ఆత్మలు దాహార్తి మయమయ్యాయి.
కళ్లల్లో కల్లోలం రేగి,
గుండెల్లో దిగులు పుట్టుకొచ్చింది.
అస్తిత్వం ఓ ఆటవస్తువయింది.
మృతుల్నే ఆరాధించే ఈ లోకంలో,
జీవితానికి విలువ లేదు.
ఇక్కడ చావొక్కటే చౌక.
యువతంతా దుర్మార్గాల్లో ఉ
రకలేస్తోంది,
వేశ్యత్వం అలంకారపు
బొమ్మయింది.
ఇక్కడ ప్రేమే వ్యాపారానికి మరో
పేరు,
మనిషికి విలువ లేని ఈ లోకంలో,
గౌరవాలు, స్నేహాలు ఒట్టి మట్టి
పెడ్డలు.
ప్రేమకి విలువనివ్వని ఈ
ప్రపంచాన్ని,
కాల్చేయండి లేదా పేల్చేయండి.
కనీసం నా చూపు నుంచైనా దూరం
చేయండి.
ఈ లోకపునీతిని నే భరించలేను.
ఈ ప్రపంచం మీదే,
మీ దగ్గరే భద్రంగా దాచుకోండి!

**బాలాజీ పోతుల**
**8179283830**

# లేఖలు

**ముఖచిత్ర కథనం**

**ఈ వారంఇంద్రవెల్లి కొండల్లో జరిగే పండుగను ఆదివారం అనుబంధంలో ప్రచురించిన వ్యాసం చాలా విశేషాలన** అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నా ము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఓతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**


సూర్య ఆదివారం
2.2.2025
ఇంద్రవెల్లి కొండల్లో
కదిలిన దండు

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

# ఓ పాఠకుడా!



నూతన అధ్యాయం మొదలెడుతున్నా
కొత్త పుంతలు తొక్కుతున్నా
నవ నవోన్మేషానికి అడుగులేస్తున్నా
నీవెనుక నేనున్నానని గుర్తించుకో
పాఠకా!

కాలంలా వేగంగా పరుగెత్తుతూ
నదిలా ముందుకు ప్రవహిస్తూ
తూఫాను హోరుగాలిలా వీస్తూ
నీవెంట నేనున్నానన్ని పకముంచుకో
పాఠకా!

రవిలా కిరణాలు వెదజల్లుతూ
శశిలా వెన్నెలను కురిపిస్తూ
తారకల్లా తళతళా మెరుస్తూ
నీవెంట నేనున్నానని తలచుకో
పాఠకా!

చెరకు రసంలా తియ్యగా
పువ్వుల తేనెలా మధురంగా
తేట తెలుగులా రమ్యంగా
నీవెంట నేనున్నానని ఎరుగు పాఠకా!

మల్లెపూల సుగంధంలా
మొగలిరేకుల సువాసనలా
మరువపత్రాల సౌరభంలా
నీవెంట నేనున్నానని గమనించు
పాఠకా!

గళమెత్తిన కోకిల కంఠంలా
పురివిప్పిన నెమలి నాట్యంలా
ఎగురుతున్న సీతాకోకచిలుకల్లా
నీవెంట నేనున్నానని కనుగొను
పాఠకా!

సంసారసాగరం ఈదుతూ
జీవనపయనం సాగిస్తూ
పగటికలలను కంటూ
నీవెంట నేనున్నానని నెమరువేసుకో
పాఠకా!

నిన్ను ఆనందడోలికలలో ముంచాలని
నీ మదిని దోచుకోవాలని
నన్ను కలకాలంగుర్తించేలా చేయాలని
నీకోసం నేనెప్పుడు
కాచుకొనియుంటానని స్మరించుకో
పాఠకా!

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**9177915285**









సూర్య బాలల కథ **బుడత**

# ధర్మంపై ఒక పాఠం

ఒకప్పుడు, ఒక జ్ఞానవంతుడు మరియు దయగల ఋషి గంగా నది ఒడ్డున కూర్చుని ప్రశాంతంగా ధ్యానం చేస్తున్నాడు. అతను ప్రవహించే నీటిని చూస్తుండగా, ప్రవాహంలో ఇబ్బంది పడుతున్న ఒక చిన్న తేలు నది శక్తికి కొట్టుకుపోతుండటం గమనించాడు. కరుణతో నిండిన ఋషి, క్రిందికి చేరుకుని, తేలును నీటిలో నుండి మెల్లగా పైకి లేపి, దాని ప్రాణాలను కాపాడుకున్నాడు. కానీ అతను అలా చేసిన వెంటనే, తేలు తన చేతిని కుట్టింది!

నొప్పి తీవ్రంగా ఉంది, కానీ ఋషి కోపంతో స్పందించలేదు. అతను తేలును ఒడ్డుకు వదిలేసి తన ధ్యానానికి తిరిగి వచ్చాడు.



కొద్దిసేపటి తర్వాత, ఋషి మళ్ళీ నది వైపు చూసి అదే తేలు తిరిగి నీటిలో పడిపోయిందని చూశాడు. సంకోచించకుండా, దానిని రక్షించడానికి అతను మరోసారి చేయి చాపాడు. మళ్ళీ, అతను తేలును ఎత్తిన వెంటనే, అది అతన్ని కుట్టింది! ఈసారి, సమీపంలోనే చూస్తున్న ఒక వ్యక్తి తన ఆశ్చర్యాన్ని ఆపుకోలేకపోయాడు.

“ ‘ఓ మునివర్యా’, నువ్వు ఆ తేలును ఎందుకు కాపాడుతున్నావు? అది ప్రతిసారీ నిన్ను కుట్టడం నీకు కనిపించడం లేదా?” ఆ వ్యక్తి అడిగాడు.

ఆ ఋషి దయతో నవ్వి, “ మిత్రమా, కుట్టడం తేలు ధర్మం. కానీ రక్షించడం మానవుని ధర్మం” అని జవాబిచ్చాడు.

ఆ వ్యక్తి ఋషి మాటల గురించి జాగ్రత్తగా ఆలోచించి వాటిలోని జ్ఞానాన్ని గ్రహించాడు. తేలు రక్షించడానికి అర్హుడా లేదా అనే దాని ఆధారంగా ఋషి వ్యవహరించడం లేదుబీ అతను సరైన దాని ఆధారంగా వ్యవహరించాడు. అతను తన ధర్మాన్ని, కరుణామయుడైన మానవుడిగా తన కర్తవ్యాన్ని అనుసరిస్తున్నాడు.

**కథ నీతి:** కష్టం అయినప్పటికీ, ధర్మం సరైనది చేయడం. బాధ కారణంగా ఋషి సహాయం చేయడంమానక పోయినట్లే, సవాళ్ల కారణంగా మనం మంచి చేయడం మానేయకూడదు. నిజమైన మంచితనం అంటే ప్రతిఫలాలను ఆశించడం కాదు, మన స్వభావానికి మరియు ఉద్దేశ్యానికి కట్టుబడి ఉండటం ఎల్లప్పుడూ దయ, సత్యం మరియు నీతిని ఎంచుకోవడం ద్వారా, మనం ప్రపంచంలోకి సామరస్యాన్ని తీసుకువస్తాము – ఋషి తన ధర్మాన్ని అనుసరించడం ద్వారా చేసినట్లుగానే.

**మండా వెంకట అప్పారావు**
**( 9347589272)**











# నేడు జాతీయ జనాభా గణన దినోత్సవం

జాతీయ జనాభా గణన దినోత్సవం మన దేశ అభివృద్ధిలో ప్రధానమైన సమాచార మూలాన్ని సేకరించే జనాభా గణనకు అంకితం చేసిన ప్రత్యేక రోజు. ఇది ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరుపు కుంటారు. జనాభా గణన ద్వారా దేశంలోని ప్రజల సంఖ్యతో పాటు వారి వయస్సు, లింగం, విద్య, ఉపాధి, జీవన ప్రమాణాలు వంటి వివరాలు సేకరించ బడతాయి.

**జనాభా గణన చరిత్ర...**

భారతదేశంలో జనాభా గణన ప్రారంభం 1872లో బ్రిటిష్ పాలనలో జరిగింది. అయితే, అది ఒక సమగ్ర గణన కాకపోవచ్చు. స్వతంత్ర భారతదేశంలో తొలి జనాభా గణన 1951లో నిర్వహించ బడింది. మొదటి జనాభా గణన ఫిబ్రవరి 9, 1951న ప్రారంభమై 28 ఫిబ్రవరి 1951 వరకు కొనసాగింది.

అప్పటి నుంచి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి ఈ గణన చేయడం ఆనవాయితీగా మారింది. 2011 జనాభా గణన 15వ గణనగా నిర్వహించబడింది, అలాగే 2021లో జరగాల్సిన జనాభా గణన కోవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది.

జనాభా గణన అనేది దేశ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడానికి కీలకమైన సమాచారం అందిస్తుంది.

నియోజకవర్గాల పునర్విభజన: జనాభా ఆధారంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరపవచ్చు.

వనరుల పంపిణీ: నీరు, విద్యుత్, రవాణా, విద్య, వైద్యం వంటి సేవలను సమానంగా అందించడంలో సహాయపడుతుంది.

ఆర్థిక ప్రణాళికలు: ఉపాధి అవకాశాలు, ఉపకార పథకాలు, పేదరిక నిర్మూలన వంటి ఆర్థిక ప్రణాళికలను రూపొందించడంలో ఈ గణాంకాలు సహాయ పడతాయి.

సామాజిక ప్రణాళికలు: వివాహ వయస్సు, విద్య, లింగసమానత్వం వంటి అంశాలపై సమాచారాన్ని అందిస్తుంది.

జనాభా గణన విధానం.. భారతదేశంలో జనాభా గణన రెండు దశలుగా జరుగుతుంది.



గృహ గణన: ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సేకరించడం, ఉదాహరణకు ఇల్లు, వసతి పరిస్థితి, కుటుంబ నిర్మాణం.

వ్యక్తిగత గణన: కుటుంబ సభ్యుల వివరాలు, వయస్సు, లింగం, విద్యా స్థాయి, ఉపాధి స్థితి, మతం, భాష వంటి అంశాలపై దృష్టి పెట్టడం.

**భారతదేశంలో జనాభా గణన ప్రత్యేకతలు...**

భారత జనాభా గణన ప్రపంచంలోనే అతిపెద్ద గణాంక సేకరణ ప్రక్రియగా గుర్తింపు పొందింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వివరాలు సేకరిస్తారు. 2011లో మొదటిసారిగా బయోమెట్రిక్ వివరాలు సేకరించి ఆధార్తో అనుసంధానం చేశారు. అత్యంత దూరప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, దట్టమైన అడవులు కలిగిన ప్రాంతాల్లోనూ ఈ గణన చేపట్టబడింది.

**జాతీయ జనాభా గణన దినోత్సవం ఉద్దేశ్యం...**

జాతీయ జనాభా గణన దినోత్సవం నిర్వహించడం ద్వారా ప్రజల్లో గణన ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయడం ద్వారా సమాజానికి తన వంతు సహకారాన్ని అందించాలని చాటి చెబుతుంది. గణనలో భాగస్వామ్యం కావడం వల్ల ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా చేస్తుంది. ప్రజల అవసరాలను గుర్తించి సరైన విధానాలు రూపొందించడంలో ఈ కార్యక్రమం దోహద పడుతుంది.

**జనాభా గణనకు సంబంధిత సవాళ్లు...**

విశాల భౌగోళిక విభజన: పర్వతాలు, అడవులు, దూర ప్రాంతాలలో గణన నిర్వహించడం,

నిరక్షరాస్యత: కొన్ని ప్రాంతాల్లో ప్రజలు సరైన సమాచారాన్ని ఇవ్వడం కష్టమవుతుంది.

సాంకేతిక సమస్యలు: వివరాలను డిజిటలైజ్ చేయడంలో వచ్చే అవరోధాలు.

తప్పుడు సమాచారం: ప్రజలు తెలియక లేదా ఉద్దేశ పూర్వకంగా తప్పుడు సమాచారం ఇవ్వడం.

జనాభా గణన ఫలితాల ప్రాముఖ్యత..

సాంస్కృతిక వివరాలు: మతం, భాష, ప్రాంతీయ భిన్నత్వాలను అర్థం చేసుకోవడం.

ప్రభుత్వ ప్రణాళికలు: ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల అభివృద్ధికి మద్దతు.

భవిష్యత్తు అంచనాలు: జనాభా పెరుగుదల, వనరుల వినియోగానికి ప్రణాళికలు రూపొందించడం.

జాతీయ జనాభా గణన దినోత్సవం, భారత అభివృద్ధికి ప్రాథమికమైన సమాచార మూలాల సేకరణకు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుంది. ప్రతి పౌరుడు ఈ గణనలో భాగస్వామ్యం కావడం ద్వారా సమాజ నిర్మాణంలో తన పాత్రను పోషించాలి. ఒక దేశ ప్రగతికి గణాంకాలు ముఖ్యమైన ఆధారం, వాటి సేకరణలో మనందరం చురుకుగా పాల్గొనాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల .9440595494**

# ప్రేమ మరియు ఆరోగ్యాన్ని వ్యాప్తి కి కాలిఫోర్నియా బాదంపప్పు

ప్రేమికుల దినోత్సవం అంటే ప్రేమను వేడుక జరుపుకోవడం మరియు మీ పట్ల శ్రద్ధను చూపించడం. వివిధ ఆరోగ్య ప్రయోజనాలతో నిండిన బహుమతితో మీ ప్రేమను వ్యక్తపరచడానికి మించిన మంచి మార్గం ఏముంటుంది ? ఈ సంవత్సరం, సాంప్రదాయ బహుమతులను దాటి, మంచి ఆరోగ్యం అనే బహుమతిని ఎంచుకోండి - అది కాలిఫోర్నియా బాదంపప్పుల పెట్టె కావొచ్చు ! . కాలిఫోర్నియా బాదంపప్పులు రుచికరమైనవి మాత్రమే కాకుండా, మొత్తం ఆరోగ్యంకు మద్దతు ఇచ్చే ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటాయి, అవి మీ ప్రియమైనవారి ఆరోగ్యం పట్ల మీ శ్రద్ధను కూడా ప్రదర్శిస్తాయి.

15 ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న కాలిఫోర్నియా బాదంపప్పులు విటమిన్ %జు%, మెగ్నీషియం, డైటరీ ఫైబర్, ఆరోగ్య కొవ్వులు మరియు ప్రోటీన్ యొక్క సహజ మూలం. ఈ బాదంపప్పులు విస్తృత శ్రేణి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మీ రోజువారీ దినచర్యలో బాదంపప్పులను చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి, బరువు నిర్వహణకు మరియు రోగనిరోధక శక్తికి మద్దతు ఇస్తుంది. 200 కంటే ఎక్కువ శాస్త్రీయ అధ్యయనాలు వాటి వైవిధ్యమైన ఆరోగ్య ప్రయోజనాలకు మద్దతు ఇస్తున్నాయి.

ఫిట్నెస్ మరియు సెలబ్రిటీ ఇన్స్ట్రక్టర్ యాస్మిన్ కరాచీవాలా మాట్లాడుతూ, "బాదం పప్పులు ఆరోగ్యకరమైన కొవ్వులతో నిండి ఉంటాయి, ఇవి శక్తి ప్రోటీన్ యొక్క అద్భుతమైన మూలం. వాటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం అందరికీ చాలా ముఖ్యం. ఇవి మిమ్మల్ని శక్తివంతం చేయడానికి సహాయపడతాయి" అని అన్నారు.

న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి మాట్లాడుతూ, "బాదం పప్పులు ఆరోగ్యానికి గొప్ప బహుమతి, ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు , కొన్ని విటమిన్లు మరియు ఖనిజాలతో సహా 15 ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది. ఈ సహజమైన, పోషకాలు అధికంగా ఉండే,



అనుకూలమైన , వైవిధ్యమైన గింజలను ఎప్పుడైనా ఆస్వాదించవచ్చు.."

ప్రముఖ నటి శ్రియ శరణ్ మాట్లాడుతూ "మీరు ఇవ్వగల ఉత్తమ బహుమతులలో బాదం ఒకటి. నా రోజువారీ ఆహారంలో బాదం పప్పులను జోడించడం వల్ల నా చర్మ ఆరోగ్యం మెరుగుపడింది, నా బరువును నిర్వహించడంలో సహాయపడింది మరియు నన్ను శక్తివంతం చేసింది" అని అన్నారు.

చర్మ నిపుణురాలు మరియు కాస్మోటాలజిస్ట్ డాక్టర్ గీతిక మిట్టల్ మాట్లాడుతూ, "బాదం పప్పుల పెట్టె అద్భుతమైన వాలెంటైన్స్ డే బహుమతిగా నిలుస్తుంది. మీ ఆహారంలో బాదం పప్పులను క్రమం తప్పకుండా చేర్చుకోవడం వల్ల చర్మ ఆకృతిని మెరుగుపరచడంలో మరియు %ఖఎదీ% కాంతికి చర్మం నిరోధకతను పెంచడంలో సహాయపడుతుంది" అని అన్నారు.

ప్రముఖ దక్షిణ భారత నటి వాణి భోజన్ మాట్లాడుతూ " వాలెంటైన్స్ డేను అందరికీ మరింత గుర్తుండిపోయేలా చేయడానికి నేను ఎల్లప్పుడూ ప్రత్యేకమైనదాన్ని తయారు చేయడం ఆనందిస్తాను. నాకు ఇష్టమైన బాదం ఆధారిత డెజర్టలో ఒకటి చాక్లెట్ మరియు బాదం బాల్, ఇది చాలా రుచికరమైనది మరియు ఆరోగ్యకరమైనది"అని అన్నారు.

ఆయుర్వేద నిపుణురాలు మధుమిత కృష్ణన్ మాట్లాడుతూ, " ఆయుర్వేదం, సిద్ధ మరియు యునాని గ్రంథాల ప్రకారం, బాదం చర్మ ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది మరియు చర్మ మెరుపును పెంచుతుంది, వాటిని రోజువారీ జీవితంలో తప్పనిసరిగా కలిగి ఉండాలి."

ఈ వాలెంటైన్స్ డే నాడు, సాంప్రదాయ స్వీట్లను దాటి, కాలిఫోర్నియా బాదంపప్పుల క్యూరేటెడ్ బాక్సులు బహుమతిగా ఇవ్వండి - ప్రియమైన వారి ఆరోగ్యానికి మద్దతు ఇస్తూ ప్రేమను చూపించడానికి ఇది అర్థవంతమైన మార్గం.

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి).

కాబట్టి మా ఇంట్లో వాళ్లు పెళ్లికి చచ్చినా ఒప్పుకోరు.'

'ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా ఇంటిని వదిలి రావడం జరగదు.'

'రాకపోతే మనం కలిసుండే అవకాశమే లేదు. నీకు రెండు రోజులు సమయం ఇస్తున్నాను. నీ కోసం రేపు రాత్రి ముద్దనూరు రైల్వేస్టేషన్ లో ఎదురుచూస్తాను. నువ్వు వస్తే ఇద్దరం వెళ్లిపోదాం, పెళ్లి చేసుకుందాం, రెండు నెలల తర్వాత అన్నీ అవే సర్దుకుంటాయన్నాడు.'

ఇద్దరూ చెరో దారి వెళ్లిపోయారు. మరుసటి రోజు రాత్రి గంగ కోసం రాజా ముద్దనూరు రైల్వేస్టేషన్ లో ఎదురుచూశాడు.

గంగకు ఏం చేయాలో అర్థంకాలేదు. నారాయణ, గౌరీని వదిలేసి ఎలా వెళ్లేదని కుమిలిపోయింది. పాపులమ్మ చెప్పిన విషయాలను గుర్తు చేసుకుంది. ఏ తప్పు చేయకపోతేనే తల్లిని అంతలా అవమానించారు, చనిపోయేలా చేశారు.

నారాయణ, గౌరీకి గంగే దిక్కు. ప్రేమ విఫలమైన పర్వాలేదు కానీ తమ్ముడిని, చెల్లిని వదిలి వెళ్లకూడదని నిర్ణయించుకుంది. పైగా రాజా కుల ప్రస్తావన తెచ్చాడు. ఏ కులం వల్ల పల్లె బాధపడుతోందో, ఏ కులం వల్ల తల్లిదండ్రులు చనిపోయారో, ఏ కులం కారణంగా గుడిలోకి అనుమతి లేదో మళ్లీ అదే కులం వల్ల పెళ్లి చేసుకున్న చోట అవమానాలు పడకూడదనుకుంది.

ఇంట్లో ఇన్ని సమస్యలు పెట్టుకొని రాజాను ప్రేమించడమే పెద్ద తప్పుగా భావించింది. రాజాతో మాట్లాడకూడదు, కలవకూడదనుకుంది. తన జీవితంలో ప్రేమ, పెళ్లికి అవకాశం ఇస్తే నారాయణ, గౌరీ జీవితాలు చిన్నాభిన్నం అవుతాయి. వాళ్ల జీవితాలు బాగుపడాలంటే వాటికి దూరం ఉండాల్సిందే.

తెల్లవారే వరకు రాజా రైల్వేస్టేషనులో ఎదురుచూసి ఇంటికి వెళ్లిపోయాడు. గంగ మీద కోపం ఒకవైపు, బాధ మరోవైపు. సతమతమయ్యాడు, గంగ ఎందుకు పరిచయం అయ్యిందా అని బాధపడ్డాడు. రెండు రోజులు తర్వాత పెద్దాసుపత్రికి వెళ్లాడు. సుబ్బక్కను తీసుకువెళ్ళారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. నారాయణ చదివే బడి దగ్గర ప్రతిరోజూ గంగ కోసం ఎదురుచూశాడు. వారం దాటినా గంగ బడి దగ్గరికి వెళ్లలేదు.

నారాయణ కోసం గంగులు, అచ్చక్క వెళ్లారు. గంగ కావాలనే పులివెందులకు వెళ్ల లేదు. రాజాకు కోపం, ఆవేశం వచ్చాయి. వేముల పల్లెకు వెళ్ళాడు. గుడిసె ముందు రాజాను చూసి గంగకు విపరీతమైన కోపం వచ్చింది.

బయటకు వెళ్తున్నానని చెప్పి రాజాను కలవడానికి వెళ్లింది. 'ఎందుకు వచ్చావు?' కటువుగా, కోపంగా.

'పులివెందులకు ఎందుకు రాలేదు? నీ కోసం పిచ్చివాడిలా ఎదురు చూస్తున్నాను.'

'రెండేళ్ల వరకు ఆగలేకపోతే నువ్వు వేరే పెళ్లి చేసుకో, నన్ను మర్చిపో.'

'నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది? నా ముఖంలోకి చూసి చెప్పు' బాధగా, ఆవేశంగా గంగ చేయి పట్టుకున్నాడు.

'నన్ను వదులు ఎవరైనా చూస్తే బాగోదని ఎంత చెప్పినా రాజా వినలేదు. గంగకు కోపం వచ్చి చెంప చెల్లుమనిపించింది.'

'నిన్ను తప్ప వేరే వాళ్లను చేసుకోలేను పదా పెళ్లి చేసుకుందాం, ఆ తర్వాత ఏమైనా జరగని' అంటూ గంగను లాగాడు.

గంగ వదలమని ఎంత గింజుకున్నా రాజా వినిపించుకోలేదు. నన్ను వదలపోతే చనిపోతానని బెదిరించింది. ఆ మాట వినగానే గంగను వదిలేశాడు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా గంగ పరిగెత్తుకుంటూ వెళ్లిపోయింది.

రాజా పిచ్చిపట్టినవాడిలా నడుచుకుంటూనే పులివెందులకు వెళ్లిపోయాడు. తినలేదు, పడుకోలేదు, పొయ్యిలో కాలినట్టు, నీటిలో కొట్టుకుపోయినట్టు, రాళ్లతో కొట్టినట్టు అనిపించింది. గంగ తప్పా మరేదీ గుర్తు రాలేదు. ప్రేమ కంటే నషా మరొకటి లేదేమో!.

@@@

గంగ, రాజాకు మధ్య ఉన్నది ఖచ్చితంగా ప్రేమేనని చెప్పలేము. వాళ్ల వయసులో ఒకరిపట్ల మరొకరికి ఆకర్షణ కలగడం సహజం. ప్రేమకు, ఆకర్షణకు చాలా తేడా ఉంటుంది. ప్రేమలో బలవంతం ఉండదు, అయితే ప్రేమ ఫలానా వయసులో పుడుతుందని, ఫలానా వయసులో పుడితేనే నిజమైన ప్రేమని చెప్పడానికి లేదు.

ప్రేమ సఫలం అవ్వాలంటే ముందు జీవితంలో స్థిరపడాలి. జీవితంలో విజయం పొందిన తర్వాత ప్రేమించుకుంటే తప్పకుండా ప్రేమ సఫలమయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా చిన్న వయసులో ప్రేమించుకోవడం వల్ల ప్రేమ సఫలమయ్యే అవకాశమే లేదు.

మీ కాళ్ల మీద మీరే నిలబడకపోతే, ప్రేమను ఎలా కాపాడుకుంటారు? ఎలా నిలబెట్టుకుంటారు? ఏదో ఒక రంగంలో విజయం సాధించి, ఆ తర్వాత తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ప్రేమ గురించి చెప్పడం ద్వారా ఒప్పుకునే అవకాశం ఉంటుంది. ఒప్పుకోకపోయినా పక్కకు వెళ్లి పెళ్లి చేసుకొని బతకచ్చు. తల్లిదండ్రులను కాదని పెళ్లి చేసుకోవడం కంటే ఒప్పించి పెళ్లి చేసుకోవడంలో ఉండే మజానే వేరు. ఒప్పుకోకపోతే మరో మార్గం ఉండదు కానీ ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా కుటుంబాలతో ప్రేమికులు కలిసిపోవాలి.

గంగ తల్లిదండ్రులకు దూరమయ్యింది. చిన్నప్పటి నుండి కష్టాలు, అవమానాలు, అవహేళనల జీవితాన్నే గడిపింది. మొదటిసారి రాజా లాంటివాడు గంగ కులం, మతం చూడకుండా గంగకు దగ్గర అవ్వడం ఇష్టపడింది. ఆ ఇష్టం పరిపూర్ణమైన ప్రేమేనని చెప్పలేము.

యుక్త వయసులో కలిగే అనేక భావనలను ప్రేమే అనుకొని యువత తప్పుడు మార్గంలోకి వెళ్తోంది. ప్రేమను ఒప్పుకోకపోతే చంపడం, చనిపోవడం అంటే జీవితం పట్ల సరైన అవగాహన లేకపోవడమే. ప్రేమ ఒకసారి మాత్రమే కాదు, ఎన్నిసార్లు అయినా కలగుతుంది. ఒకరి మీదే ప్రేమ ఉంటుందని అనుకోడానికి కూడా లేదు.

ఒకసారి ప్రేమ విఫలమైన తర్వాత మళ్లీ ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నవాళ్లు, సుఖంగా సంసారాలు చేసుకుంటున్నవాళ్లు చాలామంది ఉన్నారు. అన్నింటికంటే జీవితమే అంతిమం, ముఖ్యం. జీవించి ఉంటేనే ఏదైనా సాధించగలమనే సత్యాన్ని యువత తెలుసుకోవాలి.

మనల్ని కాదనన్నారని చంపడం, చనిపోవడం మూర త్వమే. తల్లిదండ్రుల గురించి, కుటుంబం గురించి, విలువైన జీవితాలను వదిలి చనిపోవడం ఏమిటి? చనిపోతే సమస్య పరిష్కారం అవుతుందంటే మనుషులే కాదు సమస్త జీవరాశులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిందే.

రాజా.. గంగకు ఆకర్షితుడయ్యాడు. గంగ అందం, అభినయం అలాంటిది. గంగ దూరమైతే మరో అందమైన అమ్మాయి జీవితంలోకి తప్పకుండా వస్తుంది. ఎవరో మన జీవితాల నుండి వెళ్లిపోయారని బాధపడుకుంటూ కూర్చుంటే ఎలా? ముందుకు సాగాలి, జీవితాన్ని చక్కగా అనుభవించాలి.

గంగ, రాజా.. ప్రేమను దాటి ముందుకు సాగాల్సిన అవసరాన్ని గుర్తించారు. వాళ్లు ప్రేమలో ఓడిపోలేదు, జీవితంలో గెలవాలనుకున్నారు.

@@@

రాజా తండ్రి.. వెంకట్ రెడ్డి ఇంటికి వెళ్లి గంగ, రాజా విడిపోయారని చెప్పాడు. నా కొడుకును దాని బారి నుండి కాపాడారని కృతజ్ఞతలు తెలిపాడు. ఇలాంటి ఆడవాళ్లు మగపిల్లల జీవితాలను నాశనం చేస్తారని తన పిచ్చి ఆలోచనలను బయటపెట్టాడు. వెంకట్ రెడ్డికి డబ్బును వెనక్కి ఇచ్చేశాడు.

రాజా తండ్రి చెప్పిన విషయాన్ని కొండారెడ్డికి వెంకట్ రెడ్డి చెప్పాడు. గంగ తప్పించుకుందని కొండారెడ్డి తట్టుకోలేకపోయాడు.

'నువ్వెందుకు ఇంతలా బాధపడుతున్నావన్నా, మన వాళ్లకి చెప్తే దాన్ని ఈడ్చుకొని వచ్చి నీ కాళ్ల మీద పడేస్తారు.'

'అది నాకు ప్రాణాలతో కావాలి, దాన్ని అనుభవించాలి, కొవ్వు అణచాలి.'

మనవరాలి వయసున్న గంగను కొండారెడ్డి కోరుకోవడం కంటే దుర్మార్గం ఏముంటుంది?

తమ్ముడిని చూసుకోడానికి పులివెందులకు వస్తుంది కదా! అప్పుడు దాని కథ తేలుద్దాం. కొండారెడ్డి, వెంకట్ రెడ్డి గంగను కిడ్నాప్ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

@@@

పెద్దకోటయ్య తాగుడు ఎక్కువైందని చిన్నకోటయ్య చీవాట్లు పెట్టాడు. దాంతో పెద్దకోటయ్య.. కొడుకుతో మాట్లాడటమే మానేశాడు.

ఒంటరితనం, వరలక్ష్మిని చంపాననే బాధను తట్టుకోలేకపోయాడు. రోజు రోజుకు బరువు విపరీతంగా పెరిగిపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారింది. చిన్నకోటయ్య మనిషిని పెట్టాడు కానీ వరలక్ష్మిలా ఎందుకు చూసుకుంటాడు?

మంచంలోనే ఒకటి, రెండు కానిచ్చేవాడు. శుభ్రం చేయమని పనిమనిషి మీద అరిచేవాడు. పని మనిషి పెద్దకోటయ్యను కొట్టాడు, నానాబూతులు తిట్టాడు. పనిమనిషి కొడుతున్నాడని, తిడుతున్నాడని చిన్నకోటయ్యకు చెప్పినా పట్టించుకోలేదు. అప్పటికే ఇద్దరు పనిమనుషులు వెళ్లిపోయారు. ఇప్పుడున్నవాడిని ఏమైనా అంటే అతను కూడా వెళ్లిపోతాడని ఏమీ అనలేదు. పైగా పెద్దకోటయ్య కూడా పనిచేసే వాళ్లను ఎలా పడితే అలా మాట్లాడుతాడని తెలుసు. అలా మాట్లాడితే ఎవరైనా ఎందుకు పని చేస్తారు? లోకం మారింది, ఇంకా గత సమాజంలోనో, వేముల పల్లెలో మాదిరిగా ప్రవర్తిస్తే కుదరదని పెద్ద కోటయ్య తెలుసుకోలేకపోయాడు.

రోజు రోజుకు పెద్దకోటయ్య పరిస్థితి దయనీయంగా మారింది. చేసిన తప్పుడు పనులకు చివరి రోజుల్లో అనుభవించాల్సిందే. కాళ్లు, చేతులు బాగా పనిచేసే సమయంలో నలుగురికీ సహాయం చేయకుండా మోసం, దగా, కుట్రలు, కుత్రంత్రాలు, దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలు చేస్తే ప్రకృతి ఎలా విడిచిపెడుతుంది? దాని పని అది చేసే తీరుతుంది. చేసిన తప్పుల నుండి తప్పించుకోవడం ఎవరితరం అవ్వదని మనిషి తెలుసుకోవడంలో విఫలమౌతూనే ఉన్నాడు.

***

చాలా రోజుల తర్వాత నారాయణను చూడటానికి గంగ పులివెందులకు వెళ్లింది. రాజా కోసం గంగ చూపులు వెతికాయి. రాజా కనపడలేదు, రాజా వస్తే బాగుంటుందనుకుంది. ఒకసారి చూడాలని, మాట్లాడాలని అనుకుంది. చర్చి బడిలోనే హాస్టల్ ఉంది. హాస్టల్ లో ఉన్న నారాయణతో ఒక గంట గడిపి వేములకు వెళ్లడానికి బయటకు వచ్చింది. పులివెందుల నుండి వేములకు వెళ్లడానికి ఆటోలు ఉంటాయి. ఆటోల కోసం సుమారుగా నడవాలి. మిట్ట మధ్యాహ్నం కావడంతో బజారులో మనుషులు ఎక్కువగా లేరు. గంగను నలుగురు దుండగులు వెంటబడ్డారు. తననెవరో వెంబడిస్తున్నారని గంగకు తెలిసింది, చకచకా పరుగు లాంటి నడకతో నడిచింది.

కాస్త దూరం వెళ్లిన వెంటనే గంగను బలవంతంగా బండిలో వేసుకుపోయారు. గుట్ట మీదున్న వెంకట్ రెడ్డి ఇంటికి తీసుకెళ్లి బంధించారు. కొండారెడ్డికి వెంకట్ రెడ్డి గంగను పట్టుకున్న విషయం చెప్పాడు. ఆగమేఘాల మీద కొండారెడ్డి పులివెందులకు వెళ్లాడు.

కొండారెడ్డిని చూసి గంగ భయపడలేదు. 'ఇది నీ పనేనని నాకు తెలుసు, నన్ను వదలకపోతే పుట్టగతులు లేకుండా పోతావని' తిట్టింది, అరిచింది, కొట్టింది.

'మీ అమ్మను వదిలి తప్పు చేశానే, నిన్ను వదిలే ప్రసక్తే లేదు. ఇక నువ్వు, నీ గుడిసెను మర్చిపోవాల్సిందేనని' వెకిలిగా, కొవ్వుగా, వికారంగా నవ్వాడు.

కాళ్లు, చేతులకు కట్టిన తాడు విప్పి మీద పడ్డాడు, గొడవ చేయకుండా లొంగిపొమన్నాడు. చావనైనా చస్తా కానీ నీ లాంటి దుర్మార్గుడికి దక్కేదే లేదనింది. గంగ చేతులను ఇద్దరు వ్యక్తులు గట్టిగా పట్టుకున్నారు. కొంగు తీసేశాడు, ఒక చేత్తో రెండు బుగ్గలను గట్టిగా పట్టుకొని కొవ్వు పట్టి ఉన్నావన్నాడు. ముఖం మీద కాండ్రించి ఉమ్మింది, పచ్చి బూతులు తిట్టింది.

నువ్వు నా నుండి తప్పించుకోలేవు, నీ అంతు చూస్తానని జుట్టు పట్టుకొని గోడకేసి తలను బాదాడు, గంగ తల నుండి రక్తం గడగడా కారింది. గదిలో ఉన్న ఇద్దరు మగవాళ్లు బయటకు వెళ్లారు.

గంగ జాకెట్ చించాడు, కొరికాడు, నమిలాడు, ఎత్తి కుదేశాడు. గంగ శరీరాన్ని చిత్తు కాగితంలా భావించాడు, మృగంలా అనుభవించాడు. గంగ శరీరం మీద బట్టలు లేవు, దూరంగా ఉన్న దుప్పటి తీసుకొని కప్పుకుంది.

సున్నిత ప్రదేశాల నుండి రక్తం, శరీరం మీద ఎక్కడెక్కడో పంటి ఘాట్లు, తొడల మీద బీడీలతో కాల్చాడు. వద్దని, వదలమని గంగ బతిమిలాడింది, గొంతు నులుముకొని చనిపోవాలనుకుంది. నారాయణ, గౌరీ కన్నుల్లో మెదిలారు. బాధను పంటి కింద అదిమి పట్టుకుంది.

కొండారెడ్డి గదిలో నుండి వెళ్లిన తర్వాత నెమ్మదిగా లేచి స్నానాల గదిలోకి వెళ్లడానికి నడిచింది, తొడల మధ్య నుండి రక్తం కారింది. గాయాల నుండి రక్తం ఆగలేదు. ముఖం మీద చల్లనీళ్లు చల్లుకుంది. శరీరాన్ని శుభ్రం చేసుకొని నీళ్లు తాగింది.

గది బయట ఏవో శబ్దాలు వినపడ్డాయి, ఎవరో గట్టిగా నవ్వుకున్నారు. మంచం మీద కూర్చుంది. ఏడుస్తూ, జుట్టు పీక్కుంది. తన శరీరాన్ని, మానాన్ని కాపాడుకోలేకపోయానని గుండెలు బాదుకుంది. గాయాలను తడుముకుంది, పాపులమ్మను గుర్తు చేసుకొని పిచ్చి పట్టినదానిలా అరిచింది, గది తలుపును బాదింది. బయట నుండి ఎవరూ పలకలేదు, తలుపు తీయలేదు. గంగకు ఆకలిగా అనిపించింది.

రాత్రి అయ్యిందో, పగలు అయ్యిందో అర్థంకాలేదు. నిద్రలేక కన్నులు ఉబ్బాయి, గది మొత్తం వెతికింది, ఏమీ లేవు. తలుపులు బాది బాది అక్కడే స్పృహ కోల్పోయింది. మరుసటి రోజు ఉదయం తలుపు తీశారు. స్పృహ కోల్పోయి ఉండటం చూసి డాక్టర్ ని పిలిపించారు. డాక్టర్ ఏవో మందులు ఇచ్చాడు. కొద్దిసేపటి తర్వాత గంగ స్పృహలోకి వచ్చింది. వదలిపెట్టమని కొండారెడ్డిని బతిమిలాడింది, కాళ్ల మీద పడింది.

@@@

గంగ కనపడటం లేదని గంగులు, అచ్చక్క పులివెందుల మొత్తం వెతికారు.

(మిగతా వచ్చేవారం)

జాని తక్కెడశిల
7259511956





# అమర ప్రేమికులు

# లైలా మజ్ను

**సృష్టిలో మధురాతిమధురమైనది ప్రేమ. బాల్యం నుండి అందే తల్లి ప్రేమ మొదలుకుని యుక్తవయస్సు వచ్చాక నచ్చిన చెలితో సాగించే ప్రేమాయణం, ప్రేమించిన యువతితో పెళ్ళి తరువాత సతీ ప్రేమ ఇలా చెప్పకుంటూ పోతే ప్రపంచంలో అనేక సంఘటనలు మన కళ్ళ ఎదుట మెదులుతాయి. ముఖ్యంగా యుక్త వయస్సు యువతీ యువకులు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే క్రమంలో సాగించే ప్రేమాయాణాలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాము.**

ప్రేమ జంటలను చూడగానే అమర ప్రేమికులు లైలా- మజ్నూ, సలీం-అనార్కలి, సోహ్నీ-మహీవాల్, తమిళ కవి కంబార్ కుమారుడైన అంబికాపతి చోళ యువరాణి కులోత్తుంగ చోళుని కుమార్తె అయిన అమరావతి ప్రేమగాథ, ఇటలీ దేశంలోని వెరోనా నగరానికి చెందిన రోమియో జూలియట్‌ల ప్రేమకథ ఇలా అనేక పాత్రలు మన కళ్ళ ఎదుట మెదులుతాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అనేక ప్రేమకథలులు విషాదంతోనే ముగిసిన సందర్భాలు మనం పుస్తకాలలో చదువుకునే ఉంటాము. ప్రేమ పేరు వినగానే ముఖ్యంగా అమర ప్రేమికులైన లైలా-మజ్నులను గుర్తుకు చేసుకుంటాము. ఎంతో అన్యో న్యంగా కనిపించే భార్యాభర్తలు కనిపించినప్పుడు వీళ్ళు లైలా-మజ్నులు అని పలువురు పిలవడం మనం గమనిస్తునే ఉంటాము. ప్రేమ గుడ్డిది అనే నానుడి కూడా లేకపోలేదు. పుట్టిన ప్రతి జీవి మరణించక తప్పదు. అయితే ప్రేమకు మరణం లేదని నిరూపించిన జంట లైలా-మజ్ను. హృదయస్పందన ప్రేమ, ఉఛ్వాసనిశ్వాసలు ప్రేమ అని ప్రపంచానికి చాటిచెప్పిన అమరప్రేమికులు లైలా-మజ్ను.

**లైలా - మజ్నుల ప్రేమ గాథ**

లైలా -మజ్నుది 7వ శతాబ్దానికి చెందిన నిజమైన ప్రేమకథ అని చరిత్ర చెబుతోంది. అమర జీవులైన లైలా-మజ్ను భగ్న ప్రేమికులు. మజ్నుగా పిలుస్తున్న ఖైస్ యమన్ దేశానికి చెందినవాడు కాగా లైలా సౌదీ అరేబియా నివాసి. వీరిద్దరు ఆయా దేశాల శివారు ప్రాంతాల్లో ఉండటం వల్ల సమీపాన ఉన్న కొండ గుహల్లో కలుసుకునే వారు. లైలా నివసించిన గ్రామాన్ని లైలతుల్ అఫ్లాజ్ అని పిలిచేవారు. ఆమె అప్పట్లో నివసించిన సౌదీఅరేబియాలోని ఈ గ్రామానికి నేడు లైలా పేరుతో లైలా అని పిలుస్తున్నారు. వీరిద్దరూ భౌతికంగా లేకపోయినా ఇప్పటికి శాశ్వతంగా ప్రేమికుల హృదయాలలో బతికున్నారనడానికి వీరి ప్రేమే ఓ చక్కని ఉదాహరణ. లైలా-మజ్నులది విషాదాంత ప్రేమ కథ. లైలా-మజ్నుల కథ విషాదంగా ముగిసినప్పటికీ ప్రేమానురాగాలతో మెలిగే అందమైన మంచి జంట మనకు కనిపిస్తే లైలా-మజ్నులా ఉన్నారు అని పోల్చడం నేటికీ మనం చూస్తూనే ఉంటాము.

**తొలి చూపులోనే లైలా ప్రేమలో పడిన మజ్ను**

షా అమారి కుమారుడు ఖైస్ ఇబ్న్ అల్ ముల్లావా. ఇతని మరో పేరే మజ్ను. ఇతడు పుట్టిన వెంటనే కొందరు దివ్య దృష్టి కలవారు ఖైస్ ప్రేమ కోసమే పుట్టాడు, ప్రేమకోసమే మరణిస్తాడు అని భవిష్యవాణి చెప్పారు. ఇది విని ఖైస్ తండ్రి షా అమారి భయపడి పోయాడు. ఇది నిజం కాకూడదని నిత్యం అల్లాహ్‌ను ప్రార్థించేవాడు. పేద కుటుంబంలో జన్మించిన మజ్ను యుక్త వయస్సు వచ్చాక ఉన్నత కుటుంబంలో పుట్టిన లైలా ప్రేమలో పడతాడు. లైలా ధనిక కుటుంబానికి చెందిన యువతి. ఈమె అసలు పేరు బింట్ అల్-మిన్హాల్. ఆ తరువాత ఆమె లైలాగా ప్రసిద్ధి చెందారు. అరబ్బీలో లైలా అంటే రాత్రి, చీకటి అందం ఇత్యాది అనేక అర్థాలు ఉన్నాయి. అరబ్ దేశాలతో పాటు పలు ముస్లిం దేశాలలో అమ్మాయిలకు లైలా అనే పేరు పెడుతుంటారు. లైలా కథ విషాదాంతం కావడంతో ఆ పేరు తమ పిల్లలకు పెట్టడానికి ఇష్టపడని వారు కూడా ఉన్నారు. సౌదీ అరేబియాకు చెందిన లైలా



తండ్రి నాజత్ షా తన కుమార్తెను యువరాజు వంటి యువకుడితో వివాహం చేయాలని భావించేవాడు. ఈ తరుణంలో మజ్ను మొట్ట మొదటిసారి నాజత్ షా కుమార్తె లైలాను చూసి తొలి చూపులోనే మనసు పారేసుకుని నిత్యం ఆమె ఊహల్లోనే బ్రతికేవాడు. ఇది గమనించిన మత గురువులు మజ్నును మందలించారు. ధనవంతుల కుటుంబంలో జన్మించిన లైలాను ఎలా ప్రేమిస్తావు? అని కోపగించి, ఇది తగదని హెచ్చరించేవారు. ఆ మాటలను లెక్క చేయని మజ్ను తరచు లైలాను కలుసుకుంటూ ఆమె ధ్యాసలో ఉండిపోయేవాడు. లైలా కూడ మజ్నును ప్రేమించడం వల్ల వారిద్దరి మధ్య విడదీయరానంతగా ప్రేమ బంధం నాటుకుపోయింది. అప్పట్లో సౌదీ అరేబియాలో నియమాలు చాలా కఠినంగా ఉండేవి. ప్రజలు సమూహాలుగా, తెగలుగా నివసించేవారు. మజ్ను ఒక తెగకు చెందిన వాడు కాగా, లైలా మరో తెగకు చెందిన యువతి. యుక్తవ-యస్సులో ఉన్న యువతీయువకులు ప్రేమించుకోవడం, ఏకాంతాంగా కలుసుకోవడం కూడా ఆ కాలంలో నేరంగా భావించేవారు. ఇన్ని కట్టుబాట్ల మధ్య కూడా లైలా-మజ్ను చిన్న కొండలపై ఉన్న గుహల్లో కలుసుకునేవారు. లైలా-మజ్ను కలుసుకున్న ఈ ప్రదేశాలతో పాటు ఇక్కడి గుహలు నేటికీ సౌదీ అరేబియాలో లైలా-మజ్ను కేవ్స్ పేరుతో పర్యాటక స్థలాలుగా విరాజిల్లుతున్నాయి.

**(మిగతా 8వ పేజీలో)**

( 7వ పేజీ తరువాయి)



**భగ్న ప్రేమికుల విషాద గాథ**

లైలా మీద తనకున్న ప్రేమను మజ్ను మనసులోనే దాచుకోలేకపోయాడు. తరచూ ఏదో విధంగా లైలా కంటపడేవాడు. స్వతహాగా కవి అయిన ఖైస్ లైలా మీద ప్రేమ కవితలు రాసి ఆమెకు అంకితమిచ్చేవాడు. అలా ఇద్దరూ పీకల వరకు ప్రేమలో మునిగిపోయారు. అలా లైలా కూడా మజ్నుపై మనసు పడింది. అంతే రెండు మనసులు ఒక్కటయ్యాయి. ఎవ్వరూ విడదీయరానంత బలంగా ఆ లేత మనసులు ముడివేసుకున్నాయి. కానీ ఎన్ని ముడులు వేసినా వాటిని విడగొట్టేవారు ఉన్నారన్న విషయం వారికప్పుడు తెలియలేదు. ఒకరోజు మజ్ను అని అందరూ పిలిచే ఖైస్ లైలా తండ్రి వద్దకు వెళ్ళి లైలాను తనకిచ్చి వివాహం చేయమని అడిగాడు. అందుకు లైలా తండ్రి అంగీకరించలేదు. మొత్తానికి వీరి ప్రేమ విషయం తెలుసుకున్న లైలా తల్లిదండ్రులు ఆమెను ఇంట్లోనే నిర్బంధించారు. ఈ నేపథ్యంలో లైలా సోదరుడైన తబ్రేజ్‌తో నిత్యం మజ్నుకు వాదన జరిగేది. మజ్ను తమ స్థాయివాడు కాదని భావించిన తబ్రేజ్ తన సోదరిని అతనికిచ్చి వివాహం చేయడాన్ని వ్యతిరేకించేవాడు. లైలా తల్లిదండ్రులు కూడా తబ్రేజ్‌కు వత్తాసు పలికేవారు. ఇలా అనేక గొడవలు జరిగిన పిదప తబ్రేజ్‌ను మజ్ను హత్య చేసినట్లు కొన్ని గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఆ కారణంగా మజ్నును గ్రామస్తులు రాళ్ళతో కొట్టి చంపాలని నిర్ణయిస్తారు. మజ్నును శిక్ష నుండి మినహాయించే షరతుపై వేరొక వ్యక్తితో వివాహానికి లైలా అంగీకరిస్తుంది. అనంతరం మజ్నుపై విధించిన మరణ శిక్ష రద్దు చేయగా ఉత్తర సౌదీ అరేబియాలోని దైమా తెగకు చెందిన మాలిక్ ఇబ్న్ సువైరా అనే వ్యక్తితో లైలా వివాహం జరుగుతుంది. అది తెలిసి మజ్ను గుండె పగిలేలా ఏడుస్తూ రాళ్ళపై లైలా పేరు చెక్కుతూ పిచ్చివాడిలా తిరగసాగాడు. ఇంత జరిగినా అతను లైలాను ప్రేమించడం మానలేదు. తన భార్యను వేరొకరు ప్రేమించడం లైలా భర్తకు కోపం తెప్పించింది. ఆమీదట భగ్న ప్రేమికుడైన మజ్ను చనిపోగా, ఆ విషయం తెలిసిన లైలా ఇంట్లోనే కుప్పకూలి మరణించింది. ఇద్దరినీ ప్రక్కప్రక్కనే సమాధి చేశారు. ఇలా ప్రేమికుల్ని ప్రక్కప్రక్కనే సమాధి చేస్తే స్వర్గంలో కలుస్తారని ఆ ప్రాంత వాసులు ఆ కాలంలో విశ్వసించేవారు. లైలా-మజ్ను చనిపోయిన తరువాత వారి పవిత్ర ప్రేమను గుర్తించిన పెద్దలు, మత గురువులు తదితరులు ఈ లోకంలో కలిసి బతకలేని వీరిద్దరూ కనీసం పరలోకంలోనైనా కలిసి ఉండాలని అని లైలా సమాధి పక్కనే మజ్ను సమాధి కట్టారు. ప్రేమకు చావులేదని వారి పవిత్ర ప్రేమ ఈ లోకానికి చాటి చెబుతుంది. ఈ ప్రపంచం ఉన్నంతవరకు వీరి ప్రేమ విరాజిల్లుతుంది. ఇప్పటికీ ప్రేమికులు వీరి సమాధి స్థలాన్ని పవిత్ర స్థలంగా భావిస్తున్నారు. ప్రేమ అమరం అఖిలం. మనిషికి చావున్న ప్రేమకు చావులేదని ఈ లైలా మజ్నులా ప్రేమ గాథ లోకానికి చాటిచెప్పింది. ఈ భూమి మీద ప్రేమికులున్నంత కాలం వీరి ప్రేమ విరాజిల్లుతుంది.

**సినిమాలుగా లైలా-మజ్ను కథ**

ప్రపంచంలోని అనేక భాషల్లో లైలా-మజ్ను కథను చలనచిత్రాలుగా నిర్మించారు. ఈ ప్రేమకథ విషయంలో అనేక భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది 12వ శతాబ్దానికి చెందిన సూఫీ సాహిత్యంలోని పద్యకావ్యంగా కొందరు చెబితే 7వవ శతాబ్దానికి చెందిన వాస్తవిక కథ అని మరి కొందరు చెబుతున్నారు. ఏదిఏమైనా ఈ ప్రేమ



కావ్యం దర్శకనిర్మాతలకు నచ్చడంతో తొలిసారిగా మదన్ 1922లో మూకీ చిత్రాన్ని నిర్మించగా, తరువాత 1927లో మకిలాల్, జోషిలు మరో చిత్రాన్ని నిర్మించారు. 1931లో కంజి భాయ్ రాథోడ్ టాకీగా హిందీ చిత్రం నిర్మించగా 1936లో పర్షియన్ భాషలో ఈస్ట్ ఇండియా పిక్చర్స్, 1940లో ధర్మవీర్ సింగ్ పంజాబీలో , 1941లో నాగ్సేథ్ పిక్చర్స్, 1945లో తిరిగి హిందీలో నిర్మించారు. భానుమతి తెలుగు, తమిళంలో ఒకేసారి నిర్మించి విడుదల చేశారు. హిందీలో ఎస్.డి. సుందరం మాటలు, పాటలు రాశారు. 1950, 1976లో హిందీ, బెంగాలీలలో నిర్మించగా 1982లో తిరిగి ఇదే భాషల్లో నిర్మించడం విశేషం. ఇలా పలు భాషల్లో అనేకమంది లైలా-మజ్ను ప్రేమకావ్యాన్ని వెండితెరకు ఎక్కించారు.




**లైలా-మజ్ను ఛాయా చిత్రాల వివాదం**

ఫ్రాన్స్ మ్యూజియంలో లైలా మజ్ను ఛాయా చిత్రాలు ఉన్నాయని ఇద్దరి ముఖారవిందాలతో ఉన్న ఫోటో సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతుంది. ఇది ఫోటో అని కొందరు, తైలవర్ణ చిత్రలేఖనం అని మరి కొందరు వాదిస్తున్నారు. ఇది వారిద్దరి ఫోటో కాదని పరిశోధకులు చెబుతున్నారు. లైలా-మజ్ను కథ 7వ శతాబ్దానికి చెందినది. ఫోటోగ్రఫిని 1800లో జోసెఫ్ నిక్సోర్ నీప్సే కనుగొన్నాడు. అందువల్ల లైలా-మజ్ను చిత్రాలు ఎక్కడా ఉండే అవకాశం లేదు. ఈ విషయమై పరిశోధించేందుకు కొందరు పరిశోధకులు ఫ్రాన్స్‌లోని మ్యూజియంకు వెళ్ళి అనేక చిత్రాలను పరిశీలించారు. లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ వెబ్‌సైట్ ప్రకారం లైలాగా చెబుతున్న యువతి చిత్రం జోర్డాన్‌లోని కెరాక్ అనే పట్టణంలో స్థిరపడిన మహిళ అని తేల్చి చెప్పారు. బహుశా ఆమె ఒక షేక్ భార్య అయి ఉండవచ్చు. ఆమె ధరించిన ఖరీదైన దుస్తులు ఉన్నత సామాజిక వర్గానికి చెందినదని గుర్తించారు. జోర్డాన్ తెగలకు చెందిన క్రైస్తవ మహిళలు కూడా ఇటువంటి వస్త్రధారణ, జుట్టు, జడలను కలిగివుంటారు. అయితే మరి కొందరి వాదన ప్రకారం ఫ్రాన్స్ మ్యూజియంలో ఉంది లైలా-మజ్ను ముఖాలతో ఉన్నది ఫోటో కాదని, ఆ కాలంలో చిత్రించిన తైలవర్ణ చిత్రమని కాబట్టి ఇది నిజంగా లైలా-మజ్నుల చిత్రమే అని విశ్వసిస్తున్నారు. ఇలా ఎన్ని వాదనలు ఉన్నప్పటికీ దేనికీ సరైన ఆధారాలు లేవు. అన్నీ ఊహాగానాలే. లైలా-మజ్నుల కథ పర్షియా, టర్కీ పాకిస్తాన్, భారతదేశం వంటి అనేక దేశాలలో ప్రాచుర్యం పొందింది. నిజామి గంజవి అనే పర్షియన్ కవి 12వ శతాబ్దంలో వారి ప్రేమకథ గురించి ఒక ప్రసిద్ధ కవితను రాశాడు. నాటి నుండి ఇది పర్షియన్ మూలానికి చెందిన పాత కథగా ప్రాచుర్యం పొందింది.

**లైలా-మజ్ను సమాధులు**

రాజస్థాన్ జిల్లాలోని గంగానగర్ జిల్లా అనూప్‌గడ్‌కు 11 కి.మీ దూరంలో నెలకొని ఉన్న బింజౌర్ గ్రామంలో లైలా మజ్నుల జంట సమాధి ఉంది. ఇది పాకిస్తాన్ సరిహద్దు గ్రామం. కొత్తగా పెళ్ళి చేసుకున్న జంటలు ఈ సమాధుల్ని సందర్శిస్తారు. ప్రతి ఏడాది జూన్ మాసంలో ఈ సమాధుల వద్ద ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. అప్పుడు భారీ సంఖ్యలో ప్రేమికులు, ప్రజలు హాజరౌతారు.

ఇవి నిజంగా లైలా మజ్నుల సమాధులు కావు అనే వాదన కూడా ఉంది. లైలా, మజ్ను ఈ ప్రాంత వాసుకు కానప్పుడు వారి సమాధులు ఇక్కడ ఎలా ఉంటాయి అనేది పరిశీలకుల వాదన. ఈ వివాదాలను ప్రక్కన పెడితే ప్రేమికులంతా ఎప్పటికీ గుర్తుంచుకునే పేర్లు లైలా, మజ్ను. అమర ప్రేమికులుగా కీర్తిని సంపాదించిన వీరిద్దరూ భౌతికంగా లేకపోయినా ప్రేమికుల హృదయాలలో శాశ్వతంగా ఎప్పటికీ బతికే ఉంటారు. ఎప్పుడో ఏడో శతాబ్దంలో ప్రేమ కోసం ప్రాణ త్యాగం చేసుకున్న లైలా మజ్నులను ప్రేమికుల రోజు సందర్భంగా ప్రేమికులంతా ఒకసారి స్మరించుకోవడంలో తప్పులేదు. లైలా-మజ్నుల కథ అమరం, అజరామం అనేది నేటికీ ప్రపంచ ప్రజలంతా ముక్తకంఠంతో అంగీకరిస్తారు అనేది తిరుగులేని సత్యం.

**షేక్ అబ్దుల్ హకీం జాని, తెనాలి.**

# సమయం ప్రధానం



అసలే చలి కాలం , ఆపై సాయత్రం గాలి చాలా చల్లగా అన్ని వైపుల నుండి ఒకేలా వీస్తోంది. ఈ చల్ల దనానికి సూర్యుడి వేడి కూడా తగ్గినట్టుంది కాబోలు వెలుతురు మాత్రం ఇస్తూ , వేడి తగ్గించి భూగోళం ఆవలి వైపుకు మెల్లగా చేరుకుంటున్నాడు.

రోజూ జనాలతో కిట కిటలాడే పార్కు లో ఈ రోజు జనం కాస్త ఎక్కువగానే పలచబడ్డారు. పార్కు మధ్యలోని గడ్డి మొక్కను చక్కగా గొడుగు లాగా కత్తిరించారు. దాని కింద మూడు రంగులేసిన సిమెంటు బల్లలు మూడు మూలలను చూస్తూ వేసుంచారు.

అప్పుడే మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఒకరి వెనుక ఒకరు వచ్చి ఒకే బెంచి పై పక్క పక్కన కూర్చున్నారు పద్మనాభం , విశాలాక్ష్మి దంపతులు.

ఇద్దరూ రోజు సాయత్రం ఇంటి నుంచి అలా నడుచుకుంటూ వచ్చి ఓ రెండు గంటలు అలా కాలక్షేపం చేసి , వచ్చి పోయే వాళ్లందర్నీ తమ వాళ్ళుగా చూసుకుంటూ ఇద్దరు అప్పుడప్పుడు కబుర్లు చెప్పుకుంటూ రాత్రి ఇంటికి వెళ్లి కాసింత తిని పడుకోవడం ఆ దంపతులకు అలవాటు.

ఆ రోజు వాళ్ల పక్కన ఓ ముప్పై ఏళ్ళ యసున్న యువకుడు వాళ్ళ పక్కన వచ్చి కూర్చున్నాడు.

చేతిలో ఉన్న సెల్ఫోన్ లో ఏదో కాసేపు నొక్కి , కాసేపటికి సెల్ ఫోన్ స్క్రీన్ ఆఫ్ చేసి, తన కుడి చేత్తో ఎడమ వైపున్న షర్ట్ పాకెట్లోకి కళ్లుమూసుకుని పెట్టుకున్నాడు. అతని ముఖంలో ఏదో తెలియని గాబరా కనబడుతోంది. తల కాస్త వెనుకకు వాల్చి బెంచికి ఆనించి పడుకున్నాడు.

కాసేపటి ఎవరో తట్టి నట్టుంటే పైకి లేచాడు ఆ కుర్రాడు. " బాబు నువ్వు ఎవరో తెలియదు? అసలేమైంది ? మేము ఏమైనా సహాయం చేయగలమా?" అంటూ పక్కనొచ్చి కూర్చున్నాడు పద్మనాభం. ఎవరో తెలియని వ్యక్తి , ఏమైంది అని అడుగుతుంటే కోపం రాలేదు అతనికి , వీళ్ళు ఎవరు నా కష్టం తీర్చడానికి అనుకుంటూ అనేక ప్రశ్నలతో వాళ్ళ వైపు కన్నార్పకుండా చూస్తూ ఉన్నాడు.

"అసలు మీరెవరో నాకు తెలియదు? అయినా ఏదో కాలక్షేపం చేయడానికి ఇలా వచ్చినవారు పక్కన వాళ్ళ బాధలు ఏం తీరుస్తారు ముందు మీరు ప్రశాంతంగా ఉండి ఇంటికి చేరుకోండి" అన్నాడు ఆ కుర్రాడు.

"మేం కాలక్షేపానికి వచ్చినా, నీలాంటి వాళ్ళను పలకరించకుండా ప్రతిరోజు ఇక్కడి నుంచి వెళ్ళం తెలుసా ? అయినా బాధలు పంచుకుంటే పోతాయి అంటారు. నీ బాధ ఏమిటో మాతో పంచుకో తప్పేముంది? మేము మీ అమ్మానాన్న లాంటి వాళ్ళ మనుకో " అన్నాడు పద్మనాభం చనువుగా భుజం పైన చేయి వేసి.

"సార్, మీ పిల్లలు ఎక్కడో బాగా స్థిరపడి ఉంటారు.

మీరు వయసులో ఉన్నప్పుడు బాగా సంపాదించి ఇప్పుడు వాళ్ళు బయట ఉండేసరికి రోజు అలా సాయత్రం సరదాగా ఇలా కాసేపు గడిపి ఇంటి కెళ్ళి కంటినిండా నిద్ర పోతారు. అయినా నా బాధలు మీకు అర్థం కావు " అన్నాడు ఆ కుర్రాడు.

అప్పటికే పట్టువదలని విక్రమార్కుడిలా "నీ బాధలేవో ఒక్కసారి చెప్పరాదు. నేను ఆరుస్తానో , తీరుస్తానో నీకు చెప్తే వచ్చే నష్టమేమీ లేదు కదా?" అన్నాడు పద్మనాభం.

ఎందుకో ఆయన్ను చూడగానే ఇక అన్ని సార్లు అడిగించుకోవాలని అనిపించ లేదు అతనికి," నేను ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. నాకు వచ్చే సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఇలాంటి సమయంలో అమ్మ నాన్న లకు ఆరోగ్యం బాగుండటం లేదు. వాళ్లకు హాస్పిటల్లో చూపించాలా? లేక ఇంట్లో భార్య , పిల్లాడికి కావలసిన అవసరాలని తీర్చల అన్నది అర్థం కావడం లేదు. ఏది ముందు అన్నది తేల్చుకోలేక పోతున్నాను, వాళ్ళు కూడా నా పరిస్థితి అర్థం చేసుకోవడం లేదు" అంటూ తల పట్టుకు కూర్చున్నాడు ఆ కుర్రాడు.

"అయ్యో..ఇదో పెద్ద సమస్య అందుకా ఇంత ఆలోచిస్తున్నావు? అదేదో పెద్ద సమస్య అనుకున్నానే "

అంటూ మెల్లగా నవ్వుకున్నాడు పద్మ నాభం.

ఆ నవ్వుకు అర్థం అతనికి అర్థం కాలేదు.

"చూడు బాబు నువ్వు ఇంకా జీవితం మొదటి దశలోనే ఉన్నావు, మన జీవితంలో అన్నీ వస్తుంటాయి పోతుంటాయి అలాగే సంసారం అనేది కూడా ఒక పెద్ద నాటకం లాంటిది అందులో ఎప్పుడు ఏ పాత్ర వేయాలో అప్పుడు ఆ పాత్ర వేసి తిరాల్సిందే, ఇంకొక విషయం ఏమంటే ఒక పాత్రలో ఉన్నప్పుడు ఇంకొక పాత్రలోకి వెళ్తానంటే కుదరదు. అన్నింటినీ సమ భాగాలుగా విభజించుకొని దేనికి తగ్గ ప్రాధాన్యత దానికి ఇవ్వాల్సిందే " అంటూ ఆయన చెప్పే మాటలు అతనికి అర్థం అయి కానట్టున్నాయి.

"ఇప్పుడు మన సంసారం లో ఎవరికీ ఎంత ఖర్చు పెడుతున్నాం , ఎవరిని ఎలా చూసుకుంటున్నాం అన్నది ముఖ్యం కాదు. ఎవరి కోసం ఎంత సమయం వెచ్చించాం అన్నది మాత్రమే ముఖ్యం.

నువ్వు మొదట మీ ఇంట్లో అందరితో కాస్త సమయం గడుపు, ఎవరితో ఏం మాట్లాడాలో వారితో అవి మాట్లాడు. ఎవరికీ ఇవ్వాల్సిన ప్రాధాన్యత వారికి ఇవ్వు అప్పుడూ ఎవరు నువ్వు ఎంత ఖర్చు పెడుతున్నారు అన్నది చూడరు. అందరూ నువ్వు వాళ్ళతో గడిపే సమయాన్ని బట్టి నీ పరిస్థితిని వాళ్ళు ఖచ్చితంగా అర్థం చేసుకుంటారు. కుటుంబంలో ప్రేమ అన్నది ఉంటే అదే సగం రోగాలను దూరం చేస్తుంది తెలుసా !" అన్నాడు పద్మనాభం.

తన సమస్యకు కాసింత ఊరట లభించింది, ఆ కుర్రాడు కూడా కాస్త చల్ల గాలి అనుభవించాడు.

అతను కాసేపు అలానే కూర్చున్నాడు వాళ్ళు మాత్రం ఒకరి చేయి మరొకరు పట్టుకొని అలా వెళ్తున్నారు.

**సింగంపల్లి శేష సాయి కుమార్**
**8639635907**

# అనుమానం పెనుభూతం

పెంట గ్రామంలో అక్కునాయుడు, అక్కమ్మ దంపతులు నివసించేవారు. అక్కునాయుడు దంపతులు పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయ కూలీలు. వారికి చిన్నప్పటి నుంచి లెక్కలంటే మహా భయం. లెక్కలు అర్థం కాక బడి మధ్యలో మానేశారు. వారికి ఒక్కగానొక్క కొడుకు చిన్నం నాయుడు.

ప్రతీ రోజూ రాత్రి కొడుకుని దగ్గర కూర్చో బెట్టుకుని చదివించేవారు. ఒకరోజు కొడుకు చదువుతుండగా " ఒరేయ్ చిన్నా లెక్కలు బాగా నేర్చుకో ఆల్జీబ్రా గుండె గాబరా అని మా చిన్నప్పుడు చెప్పేవారు. ఆ మాయదారి లెక్కలు మా బుర్రకి ఎక్కేలేదు. దాంతో భయపడి చదువు మానేశాం. నువ్వైనా లెక్కలు బాగా నేర్చుకుని పెద్ద ఉద్యోగం చెయ్యరా" అని చెప్పింది తల్లి.

పదేపదే తల్లిదండ్రులు లెక్కలు అర్థం కావని చెప్పడంతో ఆ చిన్నారి మనసులో లెక్కలంటే భయం ఏర్పడింది. అమ్మా నాన్నకు అర్థం కాని లెక్కలు నాకు అర్థమవుతాయా అనే అనుమానం మొదలైంది. రాను రాను ఆ అనుమానం పెనుభూతం అయ్యింది.

ఎక్కాలు చదవాలంటే చిరాకు, భిన్నాలు చెయ్యాలంటే భయం, సమీకరణాలు, సమితులకు చెప్పలేనంత దూరం. లెక్కలు మాస్టారిని



చూస్తే గుండెల్లో గుబులు మొదలయ్యేది. ఉపాధ్యాయులు ఎంత విడమరచి చెప్పినా చిన్నోడికి అర్థం అయ్యేది కాదు.

ఉపాధ్యాయులు చెప్పిన సూత్రాలు తలకెక్కేవి కావు. సంవత్సరం చివరిలో నిర్వహించిన పరీక్షల్లో కూడా గణితంలో సున్నా మార్కులు రావడంతో పరీక్ష తప్పాడు.

ఒకరోజు భార్యాభర్త ఇరువురు లెక్కల మాస్టారు వద్దకి వెళ్లి " అయ్యా మాకు ఎలాగో చదువు అబ్బలేదు. లెక్కలు అర్థం కాలేదు. ఈ విషయం మా అబ్బాయికి ఎన్నో సార్లు చెప్పాం. అయినా వాడు లెక్కలు నేర్చుకోలేకపోయాడు. కారణం ఏమిటని" అడిగారు.

"లెక్కలు అంటే భయాన్ని కల్పించారు. లెక్కలు నేర్చుకోవడం కష్టమని బుర్రకెక్కవని ఆ చిన్ని మనసులో అనుమానం పుట్టించారు. అదే మీరు చేసిన తప్పు. దాంతో లెక్కలు నేర్చుకోవడానికి దూరమయ్యాడు. ఆ అనుమానమే పెనుభూతమై పరీక్ష తప్పేలా చేరింది." అని చెప్పారు లెక్కల మాస్టారు.

**కాశీ విశ్వనాథం పట్రాయుడు**
**9494524445.**


పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## సినిమా రివ్యూ




శ్రీకాకుళం జిల్లాకు చెందిన జాలర్లు పాకిస్తాన్ చేతికి చిక్కడం, అక్కడి నుంచి వాళ్ళను మన దేశానికి తీసుకు రావడం, మధ్యలో కుటుంబ సభ్యుల సంఘర్షణ... వాస్తవంగా జరిగిన కథలో దేశభక్తితో పాటు ప్రేమ, మానవ భావోద్వేగాలు ఉన్నాయి. దీనిని దర్శకుడు చందూ మొండేటి 'తండేల్'గా తెరకెక్కించారు. యువసామ్రాట్ అక్కినేని నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సినిమా ఎలా ఉంది?

**కథ**

: రాజు (నాగచైతన్య)ది శ్రీకాకుళం జిల్లాలోని ఓ ఊరు. ఆ అబ్బాయి, సత్య (సాయి పల్లవి) ప్రేమలో ఉంటారు. తమ ప్రాంతానికి చెందిన కొంత మందితో కలిసి గుజరాత్ వెళ్లి చేపల వేట సాగించడం రాజు వృత్తి. ఏడాదికి తొమ్మిది నెలలు పనిలో ఉంటే... మిగతా మూడు నెలలు ఊరిలో సత్యతో టైమ్ స్పెండ్ చేస్తాడు. తమ ఊరి సమీపంలో చేపల వేటకు వెళ్లిన ఒకరు మరణించడంతో రాజు వచ్చిన తర్వాత వెళ్లవద్దని సత్య కోరుతుంది. అయినా ఆమె మాట కాదని వెళతాడు రాజు.

గుజరాత్ సముద్ర జలాల్లో చేపల వేటకు వెళ్లిన 22 మంది శ్రీకాకుళం జాలర్లు తుఫానులో చిక్కుకుంటారు. పాకిస్తాన్ దేశానికి చెందిన ఒక జాలారిని రక్షించే క్రమంలో ఆ దేశ జలాల్లోకి వెళతారు. దాంతో అక్కడ కోస్టు గార్డులు అరెస్ట్ చేసి కరాచీలోని సింధ్ జైలుకు తరలిస్తారు. తర్వాత ఏమైంది? వాళ్ళను మళ్ళీ మన దేశానికి తీసుకు రావడానికి ఎవరెవరు కృషి చేశారు? రావడం వెనుక ఎవరి క్రెడిట్ ఉంది? ఊరిలో మత్స్యకారుల కష్టాలు తీర్చడం కోసం సత్య ఏం చేసింది? రాజును ఎంతో ప్రేమించిన ఆమె మరొకరితో పెళ్లికి ఎందుకు అంగీకరించింది? చివరకు ఏమైంది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ**

: శ్రీకాకుళం మత్స్యకారులు ఇండియాకు వచ్చిన విషయం అందరికీ తెలుసు. ప్రేక్షకులకు క్లైమాక్స్ తెలిసినప్పుడు స్క్రీన్ ప్లేతో సర్ప్రైజ్ చేస్తూ అక్కడి వరకు దర్శకుడు తీసుకు వెళ్లగలిగినప్పుడు, ప్రేక్షకులకు తెలియని విషయాలు చెప్పినప్పుడు సక్సెస్ వస్తుంది. దర్శకుడు చందూ మొండేటి స్క్రీన్ ప్లే పరంగా సర్ప్రైజ్ చేయలేదు. ప్రేమ కథలో కొన్ని మెరుపులు మాత్రం చూపించారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని చక్కగా వాడుకున్నారు.

'తండేల్'ను భావోద్వేగభరిత ప్రేమ కథ అని చెప్పలేం. దీనిని దేశభక్తి సినిమాగానూ చూడలేం. అటు ప్రేమకు, ఇటు దేశభక్తికి మధ్య దర్శక రచయితలు ఎక్కువ సంఘర్షణ పడ్డారు. రాజు, సత్య మధ్య చూపించిన ప్రేమ కథ ఇంతకు ముందు ఎప్పుడూ, ఏ సినిమాలోనూ రాలేదా? అంటే... అటువంటి కథలు వచ్చాయి. ఓ సాధారణ ప్రేమ కథను 'చూడబుల్'గా చేసింది మాత్రం దేవి శ్రీ ప్రసాద్ సంగీతమే.సాయి పల్లవి అద్భుతంగా నటిస్తుంది. నాగ చైతన్య పక్కన జంటగా బావుంటుంది. ఆల్రెడీ 'లవ్ స్టోరీ'లో చూశాం! వీళ్లిద్దరూ 'తండేల్' ఫస్టాఫ్లో మరోసారి జంటగా కనువిందు చేశారు. ప్రేమ కథలో చక్కగా నటించారు. అయితే, వాళ్లిద్దరి నటనను దేవిశ్రీ ప్రసాద్ సంగీతం డామినేట్ చేసింది.

పాటలు వెంట వెంటనే వచ్చినట్టు ఉన్నా వినడానికి, చూడటానికి బావున్నాయి. చైతన్య, పల్లవి డ్యాన్స్... ఆ పాటల్లో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బావుంది. పాటలు అంటే కేవలం డ్యాన్స్ మాత్రమే కాదని, మాంటేజ్ సీన్స్ ద్వారా అందంగా చూపించవచ్చని మరోసారి నిరూపించారు. అయితే... పాకిస్తాన్ జైలుకు కథ షిఫ్ట్ అయ్యాక రొటీన్ దేశభక్తి సినిమాగా మారింది. కొత్తదనం లోపించింది. వాళ్ళను ఇండియా రప్పించడం కోసం చేసే ప్రయత్నాలు ఊహాజనితంగా ఉన్నాయి. అక్కడ సహజత్వం లోపించింది. సెకండాఫ్ కొత్తగా చెబితే బాగుండేది. తుఫాను వచ్చినప్పుడు సముద్రంలో చిక్కుకున్న పడవ ఒడ్డుకు చేరడానికి ఎంత ఇబ్బంది పడుతుందో... సెకండాఫ్ నుంచి క్లైమాక్స్ వరకు చేరుకోవడానికి అన్ని ఇబ్బందులు పడింది. పాకిస్తాన్ జైలులో సన్నివేశాలు దేశభక్తి భావన అసలు ఏమాత్రం కలిగించలేదు.

దేవి శ్రీ ప్రసాద్ సంగీతం సినిమాను నిలబెడుతుందని చెప్పడానికి 'తండేల్' మరో ఉదాహరణ. పాటల్లోనూ, నేపథ్య సంగీతంలోనూ... ప్రతి సన్నివేశంలో తన నుంచి బెస్ట్ ఇచ్చారు. శ్యామ్ దత్ సినిమాటోగ్రఫీ సైతం బావుంది. 'ఉప్పెన'కు వాళ్లిద్దరి వర్క్ హెల్ప్ అయ్యింది. సేమ్ టు సేమ్ ఈ సినిమాకూ అంతే! ప్రొడక్షన్ వేల్యూస్ బావున్నాయి. ప్రొడక్షన్ డిజైన్ బావుంది. యాస పరంగా బాగా వర్క్ చేశారు. అయితే డైలాగులు వినిపించేలా చెప్పించి ఉంటే బావుండేది.

నటుడిగా నాగచైతన్య ఖాతాలో మరో మంచి క్యారెక్టర్ పడింది. నటన నుంచి కాస్ట్యూమ్స్ వరకు ప్రతి విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారు. సాయి పల్లవికి పెళ్లి కుదిరిందని, సాయంత్రం పెళ్లి చేసుకోబోతుందని తెలిసిన సన్నివేశంలో నటన బావుంది. సాయి పల్లవి ఎప్పటిలా చక్కగా నటించారు. దివ్యా పిళ్ళై, 'ఆడుకాలం' నరేన్, 'రంగస్థలం' మహేష్ తదితరులు తమ తమ పాత్రల పరిధి మేరకు చేశారు.

'తండేల్'... నాగచైతన్య, సాయి పల్లవి జంట చూడముచ్చటగా ఉంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం బావుంది. థియేటర్ నుంచి బయటకు వచ్చినప్పుడు ఆ ముగ్గురూ గుర్తు ఉంటారు. 'తండేల్' కథ, సన్నివేశాలు, స్క్రీన్ ప్లే ఎటువంటి ప్రభావం చూపించదు. ప్రేమికులు, కుటుంబ సభ్యులను ఆకట్టుకునే సన్నివేశాలు కొన్ని ఉన్నాయి. ఎటువంటి అంచనాలు పెట్టుకోకుండా వెళితే కొంత వరకు ఎంజాయ్ చేయవచ్చు.

---



యాక్షన్ ఫిలిమ్స్ చేయడంలో అజిత్ కుమార్ స్టైల్ సపరేట్. స్వతహాగా కార్ రేసర్ కావడంతో డూప్ లేకుండా ఛేజింగ్ సీక్వెన్సులు చేయడం ఆయనకు అలవాటు. హాలీవుడ్ తరహాలో స్టైలిష్ అండ్ స్లీక్ యాక్షన్ ఫిలిమ్స్ చేసి విజయాలు అందుకున్నారు. ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ యాక్షన్ ఫిల్మ్ 'పట్టుదల'. తమిళంలో తెరకెక్కిన 'విడాముయర్చి'కి తెలుగు అనువాదం ఇది. ఇందులో త్రిష హీరోయిన్. యాక్షన్ కింగ్ అర్జున్, రెజినా ప్రధాన పాత్రలు పోషించారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించారు. ఈ సినిమా ఎలా ఉంది?

**కథ :**

అర్జున్ (అజిత్ కుమార్), కాయల్ (త్రిష) ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త తనకు అటెన్షన్ ఇవ్వడం లేదని భార్య బాధ పడటమే కాదు, మరొక వ్యక్తితో ప్రేమలో పడుతుంది. తనకు ఎఫైర్ ఉందని డివోర్స్ కావాలని భర్తను అడుగుతుంది. విడాకులు మంజూరు అయ్యేవరకు పుట్టింట్లో ఉంటానని కోరుతుంది. భార్యాభర్తలు ఇద్దరూ కారులో బయలు దేరతారు.

పెట్రోల్ పంప్ దగ్గర ఆగినప్పుడు అక్కడ ఉన్న సూపర్ మార్కెట్టులో కాయల్కు దీపికా (రెజినా), రక్షిత్ (అర్జున్) దంపతులతో పరిచయం అవుతుంది. ఏదో సాంకేతిక లోపం వల్ల హైవేలో కారు ఆగిపోతుంది. అప్పుడు రక్షిత్, దీపికల ట్రక్ ఎక్కుతుంది కాయల్. కారు రిపేర్ చేసుకుని వెళ్లిన అర్జున్ షాక్ తింటాడు. ట్రక్కులో కాయల్ లేదు. అర్జున్ ఎవరో తనకు తెలియదని, అతడిని తొలిసారి చూస్తున్నానని రక్షిత్ చెబుతాడు. కాయల్ ఏమైంది? భార్య ఆచూకీ తెలుసుకోవడం కోసం అర్జున్ ఏం చేశాడు? అర్జున్ ఎవరో తనకు తెలియదని రక్షిత్ ఎందుకు చెప్పాడు? దీపిక ఏమైంది? భార్యాభర్తలను హైవేలో ఇబ్బంది పెట్టిన ఆకతాయిలు ఎవరు? కాయల్ కిడ్నాప్ వెనుక ఎవరు ఉన్నారు? చివరకు ఏమైంది? ప్రాణాలకు తెగించి అర్జున్ ఎటువంటి ఫైట్ చేశాడు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :**

అమెరికన్ క్రైమ్ థ్రిల్లర్ 'బ్రేక్ డౌన్' ఆధారంగా 'పట్టుదల' (విడాముయర్చి) తెరకెక్కింది. హాలీవుడ్ స్టైల్ ఫిల్మ్ మేకింగ్, ఫ్రేమింగ్తో సినిమా చేయాలనుకోవడంలో తప్పు లేదు. రీమేక్ చేయడం తప్పు కాదు. కానీ, మన ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా కథ చెప్పారా? లేదా? అనేది ముఖ్యం. ఓటీటీలకు భారతీయులు సైతం అలవాటు పడ్డాక, హాలీవుడ్ సినిమాలు చూడటం మొదలు పెట్టిన తర్వాత రీమేక్ వంటివి చేయడం కరెక్టా? కాదా? అనేది మరీ మరీ ముఖ్యం.దర్శకుడు మగిళ్ తిరుమేని మేకింగ్ బావుంది. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ కూడా! ఆ విజువల్స్ చూస్తే... హాలీవుడ్ స్టైల్ ఫీల్ తెప్పించారు. తమిళ, తెలుగు నేటివిటీతో కూడిన కథలకు ఇంగ్లీష్ లిరిక్స్తో సాంగ్స్ చేయడం అనిరుధ్ స్టైల్. స్క్రీన్ మీద హాలీవుడ్ స్టైల్ యాక్షన్ సీన్స్ ఉండటంతో ఆ తరహా మ్యూజిక్ చేశారు. టెక్నికల్ పరంగా సినిమాలో స్టాండర్డ్స్ ఉన్నాయి. కానీ, ఎమోషనల్ పరంగా ఆడియన్స్ కనెక్ట్ అయ్యేంత సోల్ లేదు.

తెలుగు, తమిళ ప్రేక్షకులు అలవాటు పడిన కమర్షియల్ హంగుల జోలికి మగిళ్ తిరుమేని వెళ్లలేదు. అలాగని రేసీ యాక్షన్ థ్రిల్లర్ తీయలేదు. ఆయన రచన – దర్శకత్వంలో తడబాటు కనిపించింది. కథలోకి వెళ్లడానికి ఎక్కువ టైమ్ తీసుకున్నారు. అజిత్, త్రిష మధ్య ప్రేమ – పెళ్లి కథలో సోల్ లేదు. అందువల్ల, త్రిష మిస్ అయినప్పుడు అజిత్ పడే బాధను ప్రేక్షకులు ఫీల్ అవ్వలేరు. ఆల్మోస్ట్ గంట పాటు ఆ కథ సాగింది. తర్వాత వచ్చే ఛేజింగ్ / యాక్షన్ సీక్వెన్సులు, ట్విస్టులు కొంత ఆసక్తిగా సాగినా ఇంటర్వెల్ తర్వాత ప్రిడిక్టబుల్ స్టోరీ, స్క్రీన్ ప్లే కావడంతో 'వావ్' మూమెంట్స్ ఏవీ లేకుండా సినిమా చప్పగా సాగింది. క్రైమ్ ఎలిమెంట్ కూడా ఇంట్రెస్ట్ క్రియేట్ చేయలేదు.

తెలుగు డబ్బింగ్ విషయంలో అసలు కేర్ తీసుకోలేదు. విధానం బదులు విధం అని పలకడం ఏంటో? నెలలు బదులు మాసాలు అనడం ఏమిటో? ఇప్పుడు మాసం అని ఎవరు అంటున్నారు? హీరో హీరోయిన్లకు డబ్బింగ్ ఆర్టిస్టులు సెలక్షన్ కూడా బాలేదు. ఈ తరహా డబ్బింగ్ చెప్పిస్తే అజిత్ నెక్స్ట్ సినిమాలకు ఆడియన్స్ ఎవరూ రారు.

యాక్షన్ సీక్వెన్సుల్లో అజిత్ కుమార్ అసలు తగ్గలేదు. ఈ సినిమా కోసం ఒక ఛేజింగ్ సీక్వెన్స్ చేసేటప్పుడు యాక్సిడెంట్ అయ్యింది. ఆ గ్లింప్స్ కొంత కనబడుతుంది. యాక్షన్ పరంగా ఎప్పటిలా బాగా చేశారు. అయితే, అజిత్ యంగ్ లుక్ మాత్రం అందరికీ సర్ప్రైజ్. చాలా బావుంది. అజిత్ హ్యాండ్సమ్గా ఉన్నారు. త్రిష తన పాత్ర పరిధి మేరకు చేశారు. అర్జున్, రెజీనా క్యారెక్టర్స్ ఫ్లాష్బ్యాక్ స్టోరీస్ బాలేదు. ఆయా పాత్రల్లో వాళ్ళ నటన ఓకే.

'పట్టుదల' కథకు, తన పాత్రకు ఏం కావాలో అది చేశారు అజిత్. ఆయన యాక్టింగ్, స్టైల్ బావున్నాయి. సినిమా మేకింగ్ కూడా స్టయిలిష్గా ఉంది. అయితే, ఈ కథను మగిళ్ తిరుమేని చెప్పిన తీరు అసలు ఆకట్టుకునేలా లేదు. అనిరుధ్ సంగీతంలో మెరుపులు లేవు. అజిత్ వీరాభిమానులను సైతం డిజప్పాయింట్ చేస్తుంది. సో, థియేటర్లకు వెళ్లే ముందు ఆలోచించుకోండి

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :

స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

డా॥ఈడ్పుగంటి పద్మజారాణి



91 9849250852, 91 7506976164

padma.suryapaper@gmail.com


# 10.2.2025 నుండి 16.2.2025 వరకు ద్వాదశ రాశి ఫలితాలు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ప్రారంభముల్లో మానసిక ఒత్తిడి సమస్యలు అధికంగా ఉన్నప్పటికీ యోగ మెడిటేషన్ మొదలైంది చేయడం వల్ల మంచిది. స్నేహితుల సలహా సహకారంతో సంతానం విషయంలో నూతన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్లడానికి మీరు చేసే కార్యక్రమాలలో వృత్తిపరంగా ఉన్నత స్థాయి వ్యక్తుల సహకారం కూడా లభిస్తుంది. విద్యార్థులకు విద్యా సంబంధ అంశాల్లో రాత నైపుణ్యాలు తగిన విధంగా ఆసక్తి పెంచుకోవాలి. ఉప సనాబలం పైన శ్రద్ధ తీసుకుంటూ నైరశ్యాన్ని దూరం చేసుకుని ముందుకు సాగాలి. ఆలోచనలో ఆలస్యాలు ఉన్నప్పటికీ ముఖ్యమైన శ్రేయోభిలాషుల యొక్క సలహా సహకారంతో సమస్యల అధికమిస్తారు. డివియేషన్ను స్నేహ సంబంధాలు వల్ల విద్యా సంబంధ ఇబ్బంది అధికంగా ఉంటాయి. .



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

ఈ రాశి వారికి విద్యార్థులకు విద్యాపరమైన విషయాలు మీద తగిన శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా పరీక్షలు రాసేటప్పుడు శ్రీహయగ్రీవాయనమః మంత్రాన్ని పట్టించడం చాలా మంచిది. విద్యాపరమైన నూతన విషయాలు తెలుసుకుంటారు తల్లి యొక్క ఆరోగ్యం మీద ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు గృహవాతావరణం, ముఖ్యంగా గృహంలో చిన్న పాటి రిపేర్లు వాహనానికి సంబంధించిన అంశాలు కొంత చికాకులు కలిగిస్తుంది. అయినప్పటికీ వాటిని మీ యొక్క తెలివితేటలతో అధిగమిస్తూ ముందుకు వెళతారు వారం మధ్యలో నూతన సృజనాత్మకమైన నిర్ణయాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్వేగాలని నియంత్రించుకుంటూ ముందుకు వెళ్లవలసిన అవసరం ఉంది. సంతానం యొక్క అభివృద్ధి విషయంలో కొత్త విషయాలు వింటారు.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో కమ్యూనికేషన్ విషయంలో కొంత ఇబ్బందులు అధికంగా ఉంటాయి మాట్లాడవలసిన సమయంలో మాట్లాడకపోవడం వల్ల కూడా కొన్ని అవకాశాలు కోల్పోయే రీత్యా మీరెంత జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలిఆత్మీయ వ్యక్తుల సహకారంతో చెప్పవలసిన మాటలను చక్కగా చెబుతూ ఫలితాలు సాధించాలి. ప్రయాణం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మధ్యవర్తిత్వాలు అగ్రిమెంట్లు పనికిరాదు. వ్యక్తుల సహకారం తీసుకోవడానికి మనసు నిరాకరిస్తుంది. వారం మధ్యలో గృహ వాతావరణం వాహనాన్ని సంబంధించిన విషయాలు, సౌకర్యాలు, నూతన గృహ నిర్మాణ విషయంలో ఆగిన పనులు కొంత చర్చకు రావడం జరుగుతుంది.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో కుటుంబంలోని వ్యక్తులతో చర్చలు చేసి స్థిర ఆస్తుల కొరకు నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం. పెట్టు బడులకి సంకల్పం. మీ ఇంటికి బంధువులు రాక. తల్లితండ్రుల సహకారంతో గృహ ప్రయత్నాలు, భూమి కొనుగోలు కొరకు ఆలోచిస్తారు. ఆర్థికంగా ఖర్చులు అధికంగా ఉంటాయి రావలసినదని రావడంలో కొంత ఆలస్యాలు ఉంటాయి. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. ఇచ్చిన మాట నిల బెట్టుకోవడం కొంత కష్టంగా ఉంటుంది కుటుంబ వ్యవహారాలలో ఇతరుల జోక్యం కొంత విసుగును కలిగిస్తుంది. వారం మధ్యలో వృత్తికి సంబంధించిన విషయాలలో అవలీలగా ముందుకు వెళతారు. ఆగుతూ వస్తున్న పనులు ముందుకు పెడతాయి. సంకల్ప బలం పెరుగుతుంది కమ్యూనికేషన్ బాగుంటుంది



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలోసంతానం యొక్క అభివృద్ధి అంశాలలో సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులు సహకారంతో ముందు అడుగు వేస్తారు. జ్ఞాపకశక్తిని పెంచుకునే విధంగా కృషి చేయాలి. వృత్తిపరమైన ప్రయత్నాలు చాలా వరకు అను కూలంగా ఉంటాయి. ముఖ్యంగా తల్లి జీవిత భాగస్వామితో కలిసి ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాలని కోరిక బలంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత తక్కువగా ఉండటం వల్ల అందరికీ దూరంగా ఉంటారు. అయినప్పటికీ అవన్నీ మీ మనోబలంతో జయించే ప్రయత్నాలు చేయాలి. ప్రవచనాలు మొదలైన వాటి మీద ఆసక్తి అధికంగా ఉంటుంది . ఆధ్యాత్మిక ధోరణి, నైరాస్యమైన ఆలోచనలు, మీ మీద మీకు శ్రద్ధ తక్కువగా ఉంటుంది. వారం మధ్యలో ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

ప్రారంభంలో వృత్తిపరంగా అధిక బాధ్యతలు ఆలోచనలు మొదలైన వాటి వల్ల శ్రమ, సమయానికి ఆహార స్వీకరణ తీసుకోకపోవడం వల్ల కొంత అనరోగ్య భావనలు. శారీరక శ్రమ అధికంగా ఉంటుంది తగిన విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు ముఖ్యంగా కంటికి సంబంధించిన విషయాలలో జాగ్రత్తలు అవసరము. ఆధ్యాత్మిక వ్యక్తుల్ని కలుసుకుంటారు వారి ఆశీస్సులు తీసుకుంటారు ట్రస్టులు మొదలైన వాటికి విరాళాలు ఇస్తారు. వారం మధ్యలో వ్యక్తిగత ఆలోచనలు బాగుంటాయి శారీరక శ్రద్ధ పెరుగుతుంది నిర్ణయాలు తీసుకుంటారు మీ యొక్క వృత్తిలో నూతన అభివృద్ధి కొరకు విశేషంగా శ్రమ పడతారు. జీవిత భాగస్వామితో కలిపి కొత్త నిర్ణయాలు తీసుకుంటారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

ప్రారంభంలో సేవలకు తగిన గుర్తింపు గౌరవం లభిస్తుంది దూర ప్రదేశాల్లో ఉండే మిత్రులతో సంభాషణ. వచ్చిన లాభాలను సద్వినియోగ పరచుకుని విషయంలో కూడా అనాసక్తి వైరాగ్య భావనలు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక లాభాలు, ఒక సమాచారం ఆలోచనలు కలిగిస్తుంది. మీ వారసత్వ పాస్తుల విషయంలో కుటుంబ వ్యక్తులతో అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. వారం మధ్యలో కుటుంబపరమైన ముఖ్య కార్యక్రమాలు, దైవ సందర్శన, ఖర్చులు అధికంగా ఉంటాయి. నిద్రలేమి ఆహార లోపం చికాకును కలిగిస్తాయి. ఇప్పటిదాకా మందకొడిగా సాగిన ఆర్థిక విషయాలు ఓ కొలిక్కి వస్తాయి. వారం చివరిలో నూతన విషయాలు వింటారు. ఉన్నత స్థాయి వ్యక్తుల సహకారం బాగుంటుంది.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోఖర్చులు శక్తికి మించి ఉండడం వల్లచికాకులుపెరుగుతాయి. సమయానికి నిద్ర, విశ్రాంతి అవసరం. అనవసర వివాదాలకు దూరంగా ఉండాలి. వృత్తికి సంబంధించిన విషయాలు మీద ఆసక్తి తక్కువగా ఉంటుంది. రహస్య శత్రువుల వల్ల నైపుణ్యాలు పెరుగుతాయి కృషి పెరుగుతుంది. మీతెలివితేటలతోవాటినిఅధిగమించగలుగుతారు. అనవసర వ్యక్తుల జోక్యం వల్ల వృత్తిలో చికాకులు అధికం. చేస్తున్న వృత్తి మారే ఆలోచనలు అధికం చేస్తారు. అలాంటి ఆలోచనలు నియంత్రించుకుంటూ యోగా మెడిటేషన్ మొదలైనవి చేయడం మంచిది. విద్యార్థులు విద్యకి సంబంధించిన విషయాలలో చాలా గట్టిగా కృషి చేస్తారు. మధ్యలో ఆర్థిక సంబంధమైన విషయాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి ఎ



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామి యొక్క ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసే వారికి అనుకూలంగా ఉంటుంది దూర ప్రయాణాలకు అవకాశం ఉంటుంది ఆధ్యాత్మిక ప్రదేశాలు సందర్శించడానికి ప్రయత్నాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాం ఋ సామాజిక సేవ చేస్తారు,తగిన గుర్తింపు ఆశించిన స్థాయిలో లభ్యం అవటం లేదని ఒక రకమైన అసంతృప్తి ఉన్నప్పటికీ మీ పుణ్య బలముతో దాన్ని జయించే ప్రయత్నాలు చేస్తారు. తండ్రి పెద్దలు గురువుల ఆశీస్సులు లభ్యమవుతాయి. వారం మధ్యలో వృత్తికి సంబంధించి నిర్ణయాలు మార్పు చెందుతాయి, ముఖ్యంగా జీవిత భాగస్వామికి వృత్తిపరమైన అభివృద్ధి ఏర్పడుతుంది. రుణములు చెల్లించుటకు మీరు చేసే ప్రయత్నాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో మీ కృషికి తగిన ఫలితం, నూతన వృత్తులకి అవకాశము. ఉన్నత స్థాయి వ్యక్తుల సలహా సంప్రదింపులు తీసుకునేటప్పుడు నిదానమవసరం. తండ్రి యొక్క బంధువులు మీ ఇంటికి రాక,చేసే కార్యక్రమాల్లో అసంతృప్తి, ఆధ్యాత్మిక అంశాల్లో ఆటంకాలు, దూర ప్రయాణాలు, విద్యార్థులు పోటీలలో శ్రమతో విజయాలు, విదేశీ విద్యకై ఆలోచనలు, ఆకస్మిక ధన రాబడి, భాగస్వామ్యం వ్యవహారాల్లో నూతన ఆలోచనలు, వారం చివరిలో ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి , ముఖ్యమైన విషయాలు వాయిదా పడతాయి ప్రయాణాల విషయం జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి. రహస్య శత్రువుల వల్ల ఇబ్బంది అధికంగా ఉంటుంది. నూతన ప్రదేశాలలో ఆహార స్వీకరణ,



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో సంతానం యొక్క ఆరోగ్యమే శ్రద్ధ తీసుకుంటారు. మీ ఆలోచనలు మీకే వ్యతిరేకంగా ఉండడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు..సంతానముతో కలిసి వారి అభివృద్ధి విషయంలో నూతన నిర్ణయాలు చేస్తారుఉపాసన విషయంలో ఆటంకాలు. కుటుంబంలోని ఇష్టమైన వ్యక్తుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. జీవిత భాగస్వామి వృత్తిపరమైన అభివృద్ధి. కమ్యూనికేషన్ బాగుంటుంది. దూర ప్రయాణాలకు అవకాశం. జాయింట్ వెంచర్స్ గురించి దృష్టి సారిస్తారు. ఆధ్యాత్మికుల దీవెనలు అందుకుంటారు. జీవిత భాగస్వామి అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మీ విషయంలో శ్రద్ధతో నిర్ణయాలు, భాగస్వామ్య విషయాల్లో అశ్రద్ధ ఉండడం వల్ల అపార్థాలకు అవకాశం ఉంది.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

ప్రారంభమువిద్యార్థులు శ్రమ అధికము. తల్లి తండ్రుల సలహా తోడ్పాటు. మానసిక ఆరోగ్యము శ్రద్ధ. ఆహారము కొత్త ప్రదేశాల్లో తీసుకునేటపుడు జాగర్త అవసరము. మాటలవల్ల విబేధాలు రాకుండా అచ్చి తూచి మాట్లాడాలి. దగ్గర వ్యక్తులతో ఆకస్మిక కలహాలు పనులు వాయిదాలు ఉన్న సంయమనం మంచిది. ఆరోగ్య రీత్యా తగిన జాగర్తలు అవసరం. ఉద్వేగం కోపం నియంత్రించుకోవాలి. సామజికసేవ చేస్తారు. ఆధ్యాత్మిక వ్యక్తుల కలయిక, పుణ్యనదీ స్నానములు,మీ సంబంధ న్యాయ విషయములపై మంతనాలు. ఖర్చులు నియంత్రించుకోవాలి. అప్పులు చేసి తీర్చే ప్రయత్నాలు. శత్రువులు ఇబ్బంది చికాకులు ,రోగనిరోధక శక్తి పెంపోందించుకోవాలి. ఋణముల విషయం లో అప్రమత్తం.


శ్రద్ధా శ్రీనాథ్